బుధవారం
10-07-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 19
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from
Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అసాంజె కేసులో లండన్ హైకోర్టు విచారణ

లండన్: వికీలీక్స్ వ్యవస్థాపకుడు జులియన్ అసాంజెను అమెరికాకు అప్పగించాలనే నిర్ణయాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై లండన్ హైకోర్టు విచారణ ప్రారంభమైంది. ఆస్ట్రేలియన్ పౌరుడైన అసాంజెను 2019 ఏప్రిల్‌లో హైసెక్యూరిటీ బెల్‌మార్ష్ జైలుకు తరలించారు. ఇరాక్, అఫ్గాన్‌లో అమెరికా దళాల యుద్ధ నేరాలు, మానవహక్కుల ఉల్లంఘనలను వెలుగులోకి తేవడంతో అసాంజె న్యాయ ఉచ్చులో చిక్కుకుపోయారు.
14 ఏళ్ల న్యాయం పోరాటం క్రమంలో జూన్ 26న నార్తెన్ మారియానా ఐలాండ్స్‌లోని అమెరికా కోర్టు ఆయనకు ఊరటనిచ్చింది. దీంతో అసాంజె క్యాన్‌బెర్రా వెళ్లారు.

16న ఏపీ కేబినెట్

అసెంబ్లీ సమావేశాల నిర్వహణ, బడ్జెట్‌పై నిర్ణయం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ఈ నెల 16వ తేదీన జరుగనుంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన వెలగపూడి సచివాలయం మొదటి బ్లాక్‌లోని ఛాంబర్‌లో మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు తమ శాఖలకు సంబంధించిన ప్రతిపాదనలు ఈ నెల 11వ తేదీ 4గంటలలోగా పంపాలని ఆదేశించారు. మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు

- మిగతా 2 లో

వార్షిక రుణ ప్రణాళిక

రూ.5.40 లక్షల కోట్లు

వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు.

- రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ సమావేశం ఆమోదం
- వ్యవసాయానికి 14శాతం అధికంగా రుణాలు
- కౌలు రైతులకు రుణాలందాలి: సీఎం చంద్రబాబు

2లో

ఇంజినీరింగ్ సీట్ల భర్తీ షురూ

వెబ్ కౌన్సెలింగ్ పాట్లు

- అందుబాటులోకి రాని ప్రైవేట్ వర్సిటీల సీట్లు!
- విద్యార్థులు, తల్లిదండ్రుల ఎదురు చూపు
- ప్రభుత్వ ఉత్తర్వుల జారీలో జాప్యం
- కౌన్సెలింగ్‌లో 224 కళాశాలలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ ఈఏపీసెట్ (2024)వెబ్ కౌన్సెలింగ్ ఎట్టకేలకు ప్రారంభమైంది. వాస్తవంగా ఈనెల 8వ తేదీ నుంచి ప్రారంభం కావాల్సిన వెబ్ కౌన్సెలింగ్... మంగళవారం నుంచి అందుబాటులోకి వచ్చింది. కాగా ఈ కౌన్సెలింగ్ జాబితాలోకి కన్వీనర్ కోటా కింద భర్తీ చేసే వివిధ ప్రైవేట్ యూనివర్సిటీల సీట్ల జాబితా అందుబాటులోకి (రాత్రి 7 గంటల వరకు) రాలేదు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు వాటి సమాచారం కోసం పడిగాపులు కాశారు. ఆ సీట్లపై

- మిగతా 2 లో

విద్యుత్ రంగం విధ్వంసం

ఐదేళ్లలో రూ.1,29,503 కోట్ల నష్టం

- వినియోగదారులపై రూ.32,166 కోట్ల అదనపు భారం
- కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ అందించడమే లక్ష్యం
- శ్వేతపత్రం విడుదలచేసిన సీఎం చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రాష్ట్రంలో గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ అసమర్థత, జగన్ తప్పుడు నిర్ణయాలతో విద్యుత్ రంగానికి రూ. 1,29,503 కోట్ల నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. ట్రూ అప్, ట్రూ అప్ ఫ్యూయల్ అంటూ కొత్త కొత్త పేర్లతో వడ్డించిన చార్జీలతో రూ. 32,166 కోట్ల భారాన్ని మోపి ప్రజల నడ్డి విరిచారని ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాటు చేసిన తప్పిదాలు తవ్వేకొద్దీ భయంకరంగా బయటపడుతున్నాయన్నారు. పోలవరం, అమరావతి రాజధానిపై శ్వేతపత్రాలు విడుదల చేసిన చంద్రబాబు మంగళవారం విద్యుత్ రంగంపై శ్వేతపత్రం విడుదల చేశారు. ఈసందర్భంగా చంద్రబాబు పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యుత్ రంగానికి జరిగిన నష్టాలను వివరించారు. విద్యుత్ తోనే అందరి జీవితం ముడిపడి ఉంది. ఎంత సమర్థంగా వినియోగించుకోగలిగితే అన్ని లాభాలు ఉంటాయి. 1995-2004లో 1.0 సంస్కరణలు తీసుకొచ్చాం. 2014లో మరలా టీడీపీ అధికారంలోకి వచ్చాక 22.5 మిలియన్ యూనిట్ల కొరత ఉంది. దీంతో 2.0 సంస్కరణలు తెచ్చాం. 2019-24లో మధ్య ఉన్న వైసీపీ ప్రభుత్వం టారిఫ్ భారం గణనీయంగా పెంచింది. అప్పులు కూడా ఇబ్బడిముబ్బడిగా తెచ్చారు. గత ప్రభుత్వ చేతకానితనం, అహంకారంతో విర్రవీగిన వ్యక్తి వల్లే అంత నష్టం వాటిల్లింది. దీనిపై రాగద్వేషాలకు అతీతంగా ప్రజలు ఆలోచించాలని చంద్రబాబు కోరారు.

మా హయాంలో 145 అవార్డులు సాధించాం

'అనేక సంస్కరణలు అమలు చేయడం ద్వారా

- మిగతా 2 లో

'అగ్నివీర్' రద్దు చేయాలి

కేంద్రానికి కెప్టెన్ అన్షుమన్ సింగ్ తల్లి వేడుకోలు

న్యూఢిల్లీ: 'అగ్నివీర్ పథకాన్ని నిలిపివేయండని కేంద్రప్రభుత్వాన్ని చేతులు జోడించి వేడుకుంటున్నా' అని అమర కెప్టెన్ అన్షుమన్ సింగ్ తల్లి మంజూ సింగ్ అన్నారు. నాలుగేళ్ల కోసం పథకాన్ని అమలు చేయడం సరైనది కాదన్నారు. సైనికులకు ఇచ్చే పింఛన్, క్యాంటీన్, ఇతర ప్రయోజనాలు వంటివి అగ్నివీరులకు లభించవన్నారు. సైన్యాన్ని రెండుగా చీల్చవద్దని ప్రభుత్వాన్ని కోరారు. అగ్నివీరులకు నాలుగేళ్ల కోసం ఉద్యోగాలిస్తే ఆ తర్వాత సరైన కెరీర్ ఎంపిక చేసుకోలేక వారు ఇబ్బంది పడతారని ఆందోళన వ్యక్తంచేశారు. 'నాలుగేళ్ల తర్వాత శారీరకంగా, మానసికంగా బలహీనమవుతారు. తుదుపరి చదువులు కొనసాగించలేదు. ఈ పథకం సరైనది కాదు' అని మంజూ

- మిగతా 2 లో

ఇదీ లోకం!

సోమశిల మత్స్యసంపద

ఊడ్చివేత

- రెచ్చిపోతున్న మాఫియా
- నిషేధం ఉన్నా అక్రమంగా చేపల వేట
- పట్టించుకోని అధికారులు

విశాలాంధ్ర-కడప బ్యూరో: ప్రభుత్వ నిషేధాన్ని లెక్కచేయకుండా చేపల మాఫియా సోమశిల బ్యాక్‌వాటర్ లో కోట్ల రూపాయల మత్స్య సంపదను కొల్లగొడుతోంది. ముఠాలుగా ఏర్పడిన ఈ మాఫియా రెండు, మూడు ప్రాంతాలలో కోస్తా ప్రాంతంలో చేపలు పట్టడంలో అనుభవం కలిగిన వారిని తీసుకొచ్చి యథేచ్ఛగా వేట సాగిస్తున్నారు. ఏటా జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు గుడ్డు, పిల్ల దశలో చేపల వేట నిషేధించడం పరిపాటి. చేపలు గుడ్డు, పిల్ల దశలో ఉండే ఈ దశలో వేటాడితే చేపల పునరుత్పత్తి ఆగిపోయి చేపలవేటపై ఆధారపడి జీవించే నిజమైన మత్స్యకారులు జీవనోపాధి కోల్పోవలసి వస్తుంది.అంతే కాక కోట్ల రూపాయల చేపల ఉత్పత్తి నిలిచిపోతుంది. ఈ విపత్తును నివారించడానికే ప్రభుత్వం ఏటా జులై, ఆగస్టు నెలల్లో చేపల వేట నిషేధిస్తుంది.

వందల సంఖ్యలో వేటగాళ్లు

సోమశిల బ్యాక్ వాటర్ ప్రాంతంలో వందల సంఖ్యలో వేటగాళ్లు మకాం వేశారు. సోమశిల పొడవునా సుమారు 30 బృందాలు అంటే 300 నుంచి 400 మంది వరకు అక్కడే గుడారాలు వేసుకొని ఉంటూ చేపలవేట సాగిస్తున్నారు. వీరంతా తూర్పుగోదావరి, విశాఖపట్నం తదిత ప్రాంతాల నుంచి వచ్చారు. వీరికి చేపలు మాఫియా రూ.లక్షల్లో అడ్వాన్సులు ఇచ్చి ఇక్కడికి తీసుకొచ్చి చేపల వేట కొనసాగిస్తున్నారు. సోమశిలలో గుడ్డు, పిల్ల,చిన్న,పెద్ద చేపలు అన్నీ కూడా ఒడ్డున పడుతున్నాయి. దీంతో సోమశిల మత్స్య సంపదకు గండం వాటిల్లిందని మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రెండు నెలలపాటు నిషేధం ఉన్నా ఆ నిషేధాన్ని పకడ్బందీగా అమలు చేయడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు వినవస్తున్నాయి. నిషేధ సమయంలో సోమశిల వెనుక జలాల ప్రాంతంలో వేటగాళ్ల సంచారం కనిపిస్తున్నా ఎందుకు వారిని తరిమి వేయలేదనే విమర్శలు వస్తున్నాయి. మామూళ్లు దండుకుంటున్న అధికారులు చూసీచూడనట్లు పోతున్నారన్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్క సోమశిల వెనుక జలాల్లోనే రోజుకు నాలుగు టన్నుల చిన్న, పెద్ద చేపలను వేటాడి... కేజీ రూ.120 నుంచి 200 వరకు విక్రయిస్తున్నారు. కోల్‌కతా, ,ఏలూరు, తిరుచూరు ప్రాంతాలకు తరలిస్తూ సొమ్ము

- మిగతా 2 లో

ప్రత్యేక హోదాపై అసెంబ్లీలో

తీర్మానం చేయాలి

- అఖిలపక్షం ఏర్పాటు చేయాలి
- సీఎం చంద్రబాబుకు రామకృష్ణ విజ్ఞప్తి
- ఏపీ అభివృద్ధి హోదాతోనే సాధ్యమని వెల్లడి

2లో

అమెరికాలో నలుగురు తెలుగువారి అరెస్టు

ప్రిన్స్‌టన్ (టెక్సాస్): మానవ అక్రమ రవాణాతో సంబంధమున్న నలుగురు తెలుగువారు అమెరికాలో అరెస్టు అయ్యారు. చందన్ దాసిరెడ్డి (24), ద్వారకా గుండా (31), సంతోశ్ కట్కూరి (31), అనిల్ మాలే (37)ను ప్రిన్స్‌టన్, న్యూజెర్సీలో పోలీసులు అదుపులోకి

- మిగతా 2 లో

గుడిసెల తొలగింపు

అడ్డుకున్న పేదల అరెస్ట్ | ఇళ్ల స్థలాలు ఇచ్చేవరకు పోరాటం: సీపీఐ

విశాలాంధ్ర-సోమందేపల్లి: శ్రీసత్యసాయి జిల్లా సోమందేవపల్లిలో రెవెన్యూ అధికారులు పోలీసుల సహకారంతో మంగళవారం తెల్లవారుజామున ప్రభుత్వ స్థలం సర్వే నెంబర్ 700లో అక్రమంగా నిర్మించిన గుడిసెలను తొలగించారు. ఎక్స్‌కవేటర్లతో నేలమట్టం చేశారు. అడ్డుకున్న కొందరిని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ప్రభుత్వ స్థలంలో ఇల్లు కట్టుకోవడానికి వీల్లేదనీ, గుడిసెలు తొలగించాలని రెవెన్యూ అధికారులు నోటీసులు ఇచ్చామని చెబుతున్నారు. గుడిసెలు తొలగించొద్దని అధికారులను బాధితులు వేడుకున్నా కనికరించలేదు. సర్వే నెంబర్ 700లో గల ప్రభుత్వ స్థలంలో ఇల్లు లేని నిరుపేదలు వైసీపీ హయాంలో సుమారు ఏడాది కిందట గుడిసెలు వేసుకున్నారు. సమాచారం అందుకున్న సీపీఐ నేతలు ఘటనా స్థలానికి చేరుకున్నారు. నోటీసులు ఇవ్వకుండా నిరుపేదల గుడిసెలు తొలగించడం అన్యాయమని సీపీఐ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్డుకున్న పేదలను అక్రమంగా అరెస్టు చేయడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. రెవెన్యూ, పోలీస్ అధికారులు అత్యుత్సాహం చూపుతూ పేదలపై కనికరం లేకుండా కనీసం మహిళలని కూడా చూడకుండా ఈడ్చుకుంటూ వెళ్తూ ఇళ్లను కూల్చడం అత్యంత పాశవికమైన చర్య అని అన్నారు. గుడిసెలు

- మిగతా 2 లో

ఆసియా-పసిఫిక్‌లో ఉద్రిక్తతలు సృష్టించొద్దు

నాటోకు చైనా హితవు

2లో

యూరప్‌లో ఉద్యమ పునరేకీకరణ అవశ్యం: కేకేఈ

2లో

22ఏళ్ల తర్వాత పర్వతారోహకుడి మృతదేహం లభ్యం

పెరూ: పెరూ దేశంలోని హుస్కరన్ పర్వతంపై ఒక పర్వతారోహకుడి మృతదేహం లభ్యమైంది. అది 22 ఏళ్ల కిందట కనిపించకుండా పోయిన అమెరికా పౌరుడు విలియం స్టాంప్లే (59) అనే పర్వతారోహకుడిగా గుర్తించారు. 2002లో పెరూలోని హుస్కరన్ పర్వతారోహనకు వెళ్లిన ఆయన 22 వేల అడుగుల ఎత్తైన పర్వతాన్ని ఎక్కడం ప్రారంభించిన తర్వాత కొంత సేపటికి అదృశ్యమయ్యారు. తోటి పర్వతారోహకులు, పోలీసులు గాలించినా విలియం ఆచూకీ లభించలేదు. ప్రస్తుతం హుస్కరన్ పర్వతంపై మంచు కరిగిపోతున్న క్రమంలోనే విలియం మృతదేహం బయటపడింది. 22 ఏళ్ల తర్వాత కూడా మృతదేహం చెక్కుచెదరకుండా ఉండటం గమనార్హం. చనిపోయిన సమయంలో విలియం ధరించిన వస్త్రాలు, షూ, పాస్‌పోర్టు కూడా అలాగే ఉంది. పాస్‌పోర్టులోని వివరాల ఆధారంగా విలియం కుటుంబ సభ్యులకు సమాచారం అందించి, వారికి ఆయన మృతదేహాన్ని అప్పగించారు.

ఆసియా-పసిఫిక్‌లో ఉద్రిక్తతలు సృష్టించొద్దు

నాటోకు చైనా హితవు

బీజింగ్: ఆసియా-పసిఫిక్‌లో ఉద్రిక్తతలు సృష్టించే ప్రయత్నాలను మానుకోవాలని నాటోకు చైనా హితవు పలికింది. అమెరికా రాజధాని వాషింగ్టన్‌లో మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నోటో సదస్సు జరగుతుంది. దీనిని పురస్కరించుకొని నాటో చీఫ్ స్టోలెన్‌బర్గ్ చైనాపై విమర్శలను గుర్తించారు. ఉక్రెయిన్ యుద్ధానికి చైనా మద్దతిస్తున్నట్లు ఆరోపించారు. ఈ క్రమంలో నాటో ప్రాధాన్యత పెరిగిందని చెప్పుకున్నారు. స్టోలెన్‌బర్గ్ వ్యాఖ్యలను చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి లిన్ జియాన్ ఆక్షేపించారు. ఉక్రెయిన్‌లో రష్యా యుద్ధానికి చైనా మద్దతిస్తున్నట్లు నాటో చీఫ్ చేసిన ఆరోపణలను కొట్టిపారేశారు. నాటోతో ప్రపంచానికి అత్యంత ముప్పు ఏర్పడిందని అన్నారు. 'చైనాపై నాటో దాడులు, విమర్శలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఇతరులపై నెపం నెట్టే తీరును ఆక్షేపిస్తున్నాం. ఆసియా-పసిఫిక్‌లో తూర్పు దిశగా చొచ్చుకుపోయి ప్రాదేశికంగా ఉద్రిక్తలు సృష్టించాలని నాటో భావిస్తోంది. ఇందుకోసం చైనా పేరును వాడుకుంటోంది' అని దుయ్యబట్టారు. ఇలాంటి ప్రయత్నాలను మానుకోవాలని నాటోకు సూచించారు. ఇదిలావుంటే 32దేశాల ట్రాన్స్ అట్లాంటిక్ కూటమికి అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ఆతిథ్యమిచ్చారు. మూడు రోజులు జరిగే సదస్సులో ఆస్ట్రేలియా, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియా నేతలు పాల్గొంటున్నారు. 75వ వార్షికోత్సవ సదస్సును పురస్కరించుకొని నాటో ప్రధాన కార్యదర్శి జెన్స్ స్టోలెన్‌బర్గ్ మాట్లాడుతూ తమది అంతర్జాతీయ స్థాయి భద్రతా సంస్థని, ప్రాదేశిక భద్రతకు పరిమితం కాదన్నారు. ఉక్రెయిన్‌పై రష్యా దురాక్రమణకు ఇరాన్, ఉత్తర కొరియా, చైనా మద్దతు ఇస్తున్నాయని అన్నారు. ఈ వ్యాఖ్యలను చైనా తీవ్రంగా ఖండించింది.

యూరప్‌లో ఉద్యమ పునరేకీకరణ అవశ్యం: కేకేఈ

ఏథెన్స్: ఫ్రాన్స్, గ్రీస్‌తో పాటు యూరప్ వ్యాప్తంగా ఉద్యమాన్ని పునరేకీకరణ ద్వారానే ప్రజల్లో ఆశలు చిగురిస్తాయని గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ప్రధాన కార్యదర్శి కౌట్సంబస్ అన్నారు. ఫ్రాన్స్ ఎన్నికలలో లెఫ్ట్ అధ్వర్యంలోని 'న్యూ పాపులర్ ఫ్రంట్' సాధించిన విజయంపై ఆయన ఒక ప్రకటన చేశారు. 'గతంలో ప్రజా వ్యతిరేకతతో ప్రభుత్వాలు కూలిపోయాయి. ఫ్రాన్స్‌లోనూ అదే జరిగింది. యూరప్‌లో ముఖ్యంగా ఫ్రాన్స్, గ్రీస్‌లోని ప్రధాన మీడియా మొత్తం సామాజిక ప్రజాస్వామిక 'లెఫ్ట్'ను ముఖ్య పార్టీగా పేర్కొంటుండటం యాధృచ్ఛికం కాదు. మరోవైపు అనారికత, భష్టు పట్టిన సమాజం, సుస్థిరతపై సామాజిక ప్రజాస్వామ్య శాశ్వత పాత్రపై నిశ్శబ్దం నెలకొంది. దీంతో వాస్తవికత ఉద్దేశపూర్వకంగా మరుగునపడిపోతోంది' అని ' అని కౌట్సంబస్ వ్యాఖ్యానించారు. ఉద్యమ పునరేకీకరణ ద్వారానే యూరప్ ప్రజల్లో ప్రత్యేకించి గ్రీస్, ఫ్రాన్స్ ప్రజల్లో ఆశలు చిగురించజేయొచ్చు అని ఆయన ఆకాంక్షించారు.

16న ఏపీ కేబినెట్

(మొదటిపేజీ తరువాయి)

చేసే పథకాలు, ఎన్నికల హామీలపై చర్చించడంతో పాటు, ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌పై ఆర్డినెన్స్ తెచ్చే అంశం కీలకం కానున్నట్లు అధికారవర్గాలు పేర్కొంటున్నాయి. పూర్తిస్థాయి బడ్జెట్ కాకుండా మరో మూడు నెలలకు తాత్కాలిక బడ్జెట్ కోసం ఆర్డినెన్స్ తీసుకురావాలని, సెప్టెంబరులో పూర్తిస్థాయి బడ్జెట్‌ను తీసుకురావాలనే యోచనలో ముఖ్యమంత్రి ఉన్నట్లు సమాచారం. ఈ నెల 22నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించే అవకాశం ఉంది. అయితే సమావేశాలు ఎన్ని రోజులు నిర్వహించాలనే దానిపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. సూపర్ సిక్స్‌లోని కొన్ని పథకాలపై ఈ సమావేశంలో సుదీర్ఘ చర్చ జరిగే అవకాశముందని, ప్రభుత్వం ఏర్పాటై నెలరోజులు కావస్తుండటంతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసే తేదీని మంత్రివర్గం ఖరారు చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

'అగ్నివీర్' రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

సింగ్ తెలిపారు. పంజాబ్ రెజిమెంట్, 26వ బెటాలియన్-ఆర్మీ మెడికల్స్ కార్ప్సుకు చెందిన కెప్టెన్ అన్షుమన్ సింగ్‌ను మరణానంతరం కీర్తిచక్రతో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము సన్మానించారు. 2023, జులై 18-19 మధ్యరాత్రి షియాచిన్ వద్ద ఆయుధగారంలో విద్యుదాఘతం వల్ల అగ్ని ప్రమాదం జరిగింది. అక్కడ వైద్యశాల నుంచి మందులు సమీకరించే క్రమంలో తీవ్రంగా గాయపడి ఆయన చనిపోయారు. అంతకుముందు మంటల్లో చిక్కుకున్న అనేకమందిని కెప్టెన్ అన్షుమన్ సింగ్ కాపాడారు. అన్షుమన్- స్మృతీ సింగ్ ఎనిమిదేళ్లు ప్రేమించుకున్నారు. గతేడాది ఫిబ్రవరిలో పెళ్లి బంధంతో ఒక్కటయ్యారు. ఆపై రెండు నెలలకే కెప్టెన్ అన్షుమన్‌కు షియాచిన్‌లో పోస్టింగ్ లభించింది. ప్రమాదం జరిగిన రోజు చివరిసారిగా మాట్లాడుకున్నారు. అన్షుమన్-స్మృతి తమ 50ఏళ్ల జీవితాన్ని కలగన్నారు. పిల్లలు, ఇల్లు కట్టుకోవడం గురించి చివరగా మాట్లాడుకున్నారు. మొదటిసారి చూపులు కలవడంతోనే ప్రేమలో పడిపోయామని, 50ఏళ్ల జీవితాన్ని ఊహించుకున్నామని స్మృతి వెల్లడించారు.

అమరవీరుడి కుటుంబాన్ని కలిసిన రాహుల్

కెప్టెన్ అన్షుమన్ సింగ్ కుటుంబాన్ని ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ కలిశారు. ఉత్తరప్రదేశ్ రాయ్‌బరేలీ పర్యటనలో ఉన్న ఆయన... లక్నోలో నివాసముండే కెప్టెన్ అన్షుమన్ కుటుంబాన్ని భేటీకి ఆహ్వానించారు. అగ్నివీర్ పథకం, సైనికుల పరిస్థితులు, సమస్యల గురించి మాట్లాడుతకున్నట్లు సమావేశం అనంతరం మీడియాతో మంజూ సింగ్ తెలిపారు. అగ్నివీర్ పథకాన్ని రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరినట్లు రాహుల్ చెప్పారన్నారు. తమ కుటుంబానికి సాధ్యమైన సహాయ సహకారాన్ని అందిస్తామన్నారని రాహుల్ చెప్పినట్లు తెలిపారు. రాహుల్ చెబుతున్న దాంట్లో తప్పేమీ లేదని, రెండు రకాల సైనికులు ఉండకూడదని, ఆయన చెప్పేది ప్రభుత్వం వినాలన్నారు. కెప్టెన్ అన్షుమన్ సింగ్ తండ్రి రవి ప్రతాప్ సింగ్ మాట్లాడుతూ 'మేము మా కుమారుడిని కోల్పోయాం. రాహుల్ కూడా తన నానామ్మను, తండ్రిని కోల్పోయారు. మా పరిస్థితిని ఆయన అర్థంచేసుకోగలరు' అని అన్నారు.

రాహుల్ లక్నో విమానాశ్రయంలో దిగిన తర్వాత రాయ్‌బరేలీకి రోడ్డు మార్గంలో పయమనమయ్యారు. మార్గంమధ్యలో చుర్వాలోని హనుమాన్ ఆలయంలో పూజ చేశారు. దేశ శాంతి, సమృద్ధి, సుఖసంతోషాలను రాహుల్ కోరుకున్నట్లు కాంగ్రెస్ అధికార వర్గాలు పేర్కొన్నాయి. ఆయన అనంతరం భూమౌ అతిథి గృహానికి చేరుకుని పార్టీ కార్యకర్తలు, భారతీయ పరిశ్రమల సమాఖ్య (ఐఐఏ) ప్రతినిధులతో సమావేశమైనట్లు తెలిపాయి. స్థానికులతోనూ రాహుల్ మాట్లాడారని పేర్కొన్నాయి. ఆపై లాల్‌గంజ్‌లోని అమరవీరుల స్మారకాన్ని సందర్శించి పుష్పాంజలి ఘటించారని, ఎయిమ్స్-రాయ్‌బరేలీని సందర్శించారని 'ఎక్స్'లో వెల్లడించాయి.

గుడిసెల తొలగింపు

(మొదటిపేజీ తరువాయి)

కూల్చిన చోటే పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఘటన స్థలానికి సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్య, సహాయ కార్యదర్శి ఇస్మాయిల్, జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శి చలపతి, వినోద్ కుమార్, కమల్ భాష, నౌషాద్, జిలాన్, గంగాధర్, జియా, చాంద్ భాష, శివ, బాబా, శీనా, షబ్బీర్, మహిళలు అంజనమ్మ, నూర్జహాన్, భారతమ్మ, రైతు సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ కాటమయ్య తదితరులు వెళ్లి పరిశీలించారు. వారు మాట్లాడుతూ సోమందేపల్లి మండల కేంద్రంలో సర్వే నెంబర్ 700లో గత సంవత్సరం కాలంగా నిరుపేదలు గుడిసెలు కట్టుకొని కాపురాలు ఉంటున్నారని, తెల్లవారుజామున మూడు గంటల సమయంలో రెవిన్యూ అధికారులు, పోలీస్ సిబ్బంది వాటిని తొలగించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా తొలగించడం సరైనది కాదని అడ్డుకున్న సీపీఐ మండల కార్యదర్శి బాలస్వామి, సహాయ కార్యదర్శి చాంద్ బాషా తదితరులను అరెస్ట్ చేయడం దుర్మార్గమన్నారు. దీనికి నిరసనగా బాధితులతో కలిసి ఎమ్మార్వో కార్యాలయం వద్ద వంటావార్పు కార్యక్రమం చేపట్టారు.

న్యాయం చేయండి: బాధితులు

బాధితులు మాట్లాడుతూ తాము ఏడెనిమిది నెలలుగా ఇక్కడ ఇళ్లు నిర్మించుకుని జీవిస్తున్నామని, చాలా వరకు అప్పు చేసి ఒక్కో ఇంటిని రూ.50 వేల నుంచి రూ.లక్ష దాకా ఖర్చుపెట్టి నిర్మించామని, గూడు కోల్పోయిన తమ బాధలు ఎవరు తీరుస్తారని కన్నీరుమున్నీరయ్యారు. అప్పు ఎవరు తీరుస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. తమకు ఇళ్లులేవని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. కనీసం తమ సామాగ్రి తీసుకెళ్లడానికైనా అవకాశమైనా ఇవ్వాలంటూ అధికారులను వేడుకున్నారు. లేకుంటే తమకు ఆత్మహత్యే శరణ్యమని ఆర్తనాదాలు పెట్టారు.

వార్షిక రుణ ప్రణాళిక రూ.5.40 లక్షల కోట్లు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5,40,000 కోట్లతో రుణ ప్రణాళికను విడుదల చేశారు. వీటిలో రూ.3,75,000 కోట్లు ప్రాధాన్య రంగాలకు, రూ.1,65,000 కోట్లు ఇతర రంగాలకు కేటాయించారు. వెలగపూడి సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళవారం స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) సమావేశం జరిగింది. రుణ ప్రణాళికలో వ్యవసాయ రంగానికి రూ.2,64,000 కోట్లు రుణాలు లక్ష్యంగా పెట్టుకున్నారు. గతం కంటే ఈసారి 14 శాతం అధికంగా రుణాలు ఇవ్వాలని నిర్ణయించారు. డైరీ, పౌల్ట్రీ, ఫిషరీస్, వ్యవసాయ యాంత్రీకరణకు, వ్యవసాయం రంగంలో మౌలిక సదుపాయాలకు రూ.32,600 కోట్లతో రుణ ప్రణాళిక రూపొందించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రాధాన్యతా రంగానికి రూ.3,23,000 కోట్లు రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకోగా...ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.3,75,000 కోట్లు రుణ ప్రణాళికా లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. గతంతో పోల్చితే 16 శాతం అధిక రుణాలను లక్ష్యంగా పెట్టుకున్నారు. వ్యవసాయ రంగానికి గత సంవత్సరం రూ.2,31,000 కోట్లు రుణ లక్ష్యంగా పెట్టుకోగా అందులో 90 శాతం అనగా రూ.2,08,136 కోట్ల రుణాలు మంజూరు జరిగిందని సమావేశంలో తెలిపారు. ఉద్యోగ, ఉపాధి కల్పనకు దోహదపడే ఎంఎస్ఎంఈ రంగానికి 2023-24 ఏడాదిలో రూ.69,000 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా, ఈ ఏడాది ఏకంగా రూ.87,000 కోట్లు లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. అలాగే గృహ నిర్మాణానికి రూ.11,500 కోట్లు రుణాలు, సాంప్రదాయేతర ఇంధన సెక్టారుకు రూ. 8,000 కోట్లు రుణాలు ఇవ్వనున్నారు.రాష్ట్రంలో వ్యవసాయానికి ఊతమిచ్చేలా బ్యాంకులు పనిచేయాలని సీఎం చంద్రబాబు కోరారు. ముఖ్యంగా కౌలు రైతులకు రుణాలు సులభంగా అందే పరిస్థితి రావాలన్నారు. దీని కోసం బ్యాంకులు, ప్రభుత్వం కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అన్నారు.

5 ప్రధాన అంశాలపై ప్రభుత్వం, బ్యాంకర్లతో సబ్ కమిటీ

గత ప్రభుత్వం అనుసరించిన విధానాల వల్ల అన్ని వ్యవస్థలు కుదేలయ్యాయని...మళ్లీ గాడిన పెట్టేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చంద్రబాబు భరోసా ఇచ్చారు. కీలక అంశాల్లో మెరుగైన ఫలితాలు సాధించేందుకు ప్రభుత్వం, బ్యాంకులు కలిసి పని చేయాలని, ఇందుకోసం మంత్రులు, బ్యాంకర్లు, నిపుణులతో కమిటీ ఏర్పాటు చేస్తామని తెలిపారు. 5 అంశాలపై ప్రణాళికలు సిద్ధం చేసి, అమలు చేసేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని సీఎం వెల్లడించారు. సంపద సృష్టించే రంగాలకు బ్యాంకులు ప్రోత్సాహం ఇచ్చే అంశంపై బ్యాంకులు ఫోకస్ పెట్టాలన్నారు. డిజిటల్ లావాదేవీల్లో ఏపీ మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఉందని, రానున్న రోజుల్లో నెంబర్-1గా నిలిచే ప్రణాళికలు అమలు చేయాలని సూచించారు. డిజిటల్ చెల్లింపులను బ్యాంకులు కూడా ప్రోత్సహించాలని, తద్వారా అవినీతి తగ్గుతుందని... ప్రొడక్టవిటీ పెరుగుతుందని చంద్రబాబు విశ్లేషించారు. పేదరికం నిర్మూలన విషయంలో ప్రభుత్వం కొత్తగా పి 4 విధానం తీసుకువస్తుందని సీఎం అన్నారు. ప్రభుత్వం పేదరిక నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యల విషయంపైన సబ్ కమిటీ ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. యువత స్కిల్ పెంచడంపై తమ ప్రభుత్వం దృష్టిపెట్టిందని, స్కిల్ డెవలప్‌మెంట్‌కు తీసుకోవాల్సిన చర్యలపై సబ్ కమిటీ స్టడీ చేయాలని సూచించారు. అలాగే సంపద సృష్టించే, జీఎస్‌డీపీ పెంచే రంగాలకు బ్యాంకుల ప్రోత్సాహం అవసరమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వ్యవసాయ శాఖా మంత్రి కింజారపు అచ్చెన్నాయుడు, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, యూనియన్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సంజయ్ రుద్ర, ఎస్.ఎల్.బీసీ కన్వీనర్ సీ.వి.ఎస్ భాస్కర్ రావు, ఇతర బ్యాంకు అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక హోదాపై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

విశాలాంధ్రబ్యూరో- కాకినాడ : గడచిన ఐదేళ్ల కాలంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకుపోయిందని... రూ.12 లక్షల కోట్లు రుణభారం ప్రజలపై పడిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ అన్నారు. ప్రతినెలా పెన్షన్‌లు, జీతాలు ఇచ్చేందుకు అప్పులు చేయవలసిందేనని, ఏ ప్రభుత్వాలు ఉన్నప్పటికీ అప్పులు తప్పని పరిస్థితి నెలకొందని తెలిపారు. కాకినాడలో మూడు రోజులపాటు జరుగుతున్న అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగతులు కాకినాడ సూర్య కళామందిర్‌లో సోమవారం ప్రారంభం కాగా రెండవ రోజు మంగళవారం ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు కాకినాడ వచ్చిన రామకృష్ణ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ... సోమవారం రాజమండ్రిలో బీజేపీ నిర్వహించిన రాష్ట్ర సదస్సులో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని, డబుల్ ఇంజన్ సర్కార్‌తో అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి చెప్పడాన్ని రామకృష్ణ ఎద్దేవాచేశారు. 2014లో కూడా రాష్ట్రం విడిపోయిన తర్వాత డబుల్ ఇంజిన్ సర్కార్... ఏమీ చేయలేకపోయిందని, ఇప్పుడు మళ్లీ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలకటం రాష్ట్ర ప్రజలను మోసం చేయటమేనని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి జరగాలంటే ప్రత్యేక హోదాతోనే సాధ్యమని అన్ని రాజకీయ పార్టీలు ఒక్క తాటిపై నిలిచి రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధించుకోవాలని ఆయన సూచించారు. ఇప్పుడు కేంద్రంలో కొనసాగుతున్నది బీజేపీ సర్కారు కాదని ఎన్డీఏ సర్కార్ అని గుర్తు చేశారు. టీడీపీ, జేడీయూ కీలక భూమిక వహిస్తున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ నేతృత్వంలో ఆ రాష్ట్ర అసెంబ్లీలో ప్రత్యేక హోదా కోసం తీర్మానం చేసి కేంద్రానికి పంపడం జరిగిందని... ఆ దిశగా ఏపీ కూడా ముందడుగు వెయ్యాలని రామకృష్ణ సూచించారు. జనాభాలో అగ్ర స్థానంలో ఉన్న భారతదేశం... అభివృద్ధిలో చైనాకంటే వెనకబడి ఉండటం సిగ్గుచేటు అన్నారు. కేంద్ర ప్రభుత్వం మాటల గారడీ పక్కనబెట్టి... ఏపీ అభివృద్ధికి సహకరించాలని డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విడిపోయాక పదేళ్లలో తెలంగాణ రాష్ట్రం ఐటీ రంగంలో పెద్ద ఎత్తున దూసుకుపోతోందని... ఆ రాష్ట్రం ఐటీ ద్వారా 80 బిలియన్ డాలర్లు ఆదాయం సమకూర్చుకుందన్నారు. విభజన హామీలు నెరవేరాలన్నా, ఆంధ్రప్రదేశ్ ఐటీ, పారిశ్రామిక రంగంలో అభివృద్ధి చెందాలన్న ప్రత్యేక హోదాతోనే సాధ్యమని పునరుద్ఘాటించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు రాజకీయాలు పక్కన పెట్టి రాష్ట్ర అభివృద్ధి కొరకు నిలబడాలని, ఇందుకోసం అఖిల పక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తాటిపాక మధు, సీపీఐ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి బోడకొండ, జిల్లా సహాయ కార్యదర్శి తోకల ప్రసాద్, కార్యవర్గ సభ్యులు పీ సత్యనారాయణ, టీ అన్నవరం పాల్గొన్నారు.

సోమశిల మత్స్యసంపద ఊడ్చివేత

(మొదటిపేజీ తరువాయి)

చేసుకుంటున్నారు. కాస్తో కూస్తో స్థానికంగా వ్యాపారాలకు విక్రయిస్తున్నారు. ఎండబెట్టిన చిన్న చేపలను కేజీ రూ.150 నుంచి 200 రూపాయల వరకు విజయవాడ తదితర ప్రాంతాల్లో విక్రయిస్తారని సమాచారం. ఇందుకోసం రూ.కోటి, రెండు కోట్ల అడ్వాన్సులు కూడా తెచ్చుకొని వీటిని వారికి తరలిస్తున్నట్లు సమాచారం. ఒక్కోసారి మూడు నుంచి నాలుగు టన్నుల వరకు చేపలు తరలిస్తూ... ఎదుగుదల కాకుండానే సోమశిల పిల్ల చేపలను ఊడ్చేస్తున్నారు. కడప జిల్లాలో లైసెన్స్ ఉన్న మత్స్య కారులు 50 మంది మాత్రమే ఉన్నట్లు సమాచారం. వీరిలో కూడా కొందరు ఇతరుల పేర్లతో, ఫోటోలతో లైసెన్స్ పొందినట్లు ఆరోపణలున్నాయి. అట్లయినా కూడా సోమశిలలో వందల మంది ఎందుకు ఉన్నట్లు ? పైగా నిషేధ సమయంలో వేట ఉండదు కాబట్టి లైసెన్స్ ఉన్నా లేకపోయినా అక్కడ ఉండే వారిని అధికారులు ఎందుకు బయటకు పంపించలేకపోతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. కాగా చేపల వేటకు రిజర్వ్ ఫారెస్ట్ నుంచే వెళ్లాల్సి ఉంది. రిజర్వ్ ఫారెస్ట్ లో లైసెన్స్ ఉన్నవారు వెళ్తే సరే... అది కూడా నిషేధ సమయంలో ఎవరు వెళ్ల కూడదు. అయినా రాకపోకలు జరుగుతున్నా... అటవీ అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. కడప జిల్లాలోని గోపవరం, ఒంటిమిట్ట మండలాల్లోని బ్రాహ్మణపల్లె, గట్టుపల్లె, కుడమలూరు, బెస్తపల్లి ప్రాంతాల్లోనూ, అన్నమయ్య జిల్లా నందలూరు మండలం కోనాపురం ప్రాంతాల్లోనూ అక్రమంగా చేపల వేట సాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాంతాలకు వెళ్లాలంటే ఒంటిమిట్ట, గోపురం మండలాల్లోని అడవి నుంచి వెళ్లాలి. గతంలో చేపల వేట మాటున ఒంటిమిట్ట మండలంలో ఎర్రచందనం తరలించిన సంఘటనలు బయటపడ్డాయి. ఈ పరిస్థితుల్లో చేపల వేట పేరుతో రిజర్వ్ ఫారెస్ట్ లో తిరుగుతున్న వీరిని అటవీ అధికారులు ఎందుకు నిలువరించలేక పోతున్నారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అటవీ అధికారులు, మత్స్యశాఖ అధికారులు చేపల మాఫియా పై గట్టి చర్యలు తీసుకుంటేనే సోమశిల మత్స్య సంపద కనుమరుగు కాకుండా ఉంటుంది.

విద్యుత్ రంగం విధ్వంసం

(మొదటిపేజీ తరువాయి)

గతంలో తమ ప్రభుత్వ హయాంలో విద్యుత్ రంగంలో మొత్తం 145 అవార్డులు సాధించాం. అదే వైసీపీ ప్రభుత్వం వినియోగదారులపై రూ.32,166 కోట్ల భారం మోపింది. వీటీపీఎస్, కేటీపీఎస్ ఆలస్యం వల్ల రూ.12,816 కోట్లు అదనంగా భారం పడింది. పోలవరం హైడ్రాలిక్ కాంట్రాక్ట్ మార్చడం వల్ల 2023కి పూర్తికావాల్సి ఉన్నా పూర్తి కాకపోవడంతో రూ.4,737 కోట్లకు భారం పెరిగింది. సెకీ సోలార్ వల్ల, అప్పులు వడ్డీలు, పవర్ స్టేషన్ కెపాసిటీ తగ్గించడం, నిలిపివేత కారణంగా మొత్తంగా రూ.47,741 కోట్లు ప్రజలపై భారం పడింది.

ఒక అసమర్థ ప్రభుత్వం ఉంటే ఏ విధంగా శాపంగా మారిందో ఇదొక కేస్ స్టడీ. ఈ అప్పులన్నీ ప్రజలే చెల్లించాలి. పెట్టుబడి దారులకు నమ్మకం పోవడంతో పాటు రాష్ట్ర బ్రాండ్ దెబ్బతింది. సోలార్ వాడుకుంటే కరెంట్ మనకు వచ్చేది. కానీ వాడకుండా రిజెక్ట్ చేశారు. వినియోగించని కరెంట్ కు కూడా కోర్టు ఆదేశాలతో రూ.9 వేల కోట్లు చెల్లించాల్సి వచ్చింది. 21 విండ్, ఇతర ఒప్పందాలను రద్దు చేయడం వల్ల కూడా భారం పడింది. రాజధానిలో కాంట్రాక్ట్ వర్క్ రూ.1315 కోట్లుకు గాను



రూ. 406 కోట్లు ఖర్చు అయింది. ఆ పనులు రద్దు చేయడం వల్ల రూ.281 కోట్లు అదనంగా భారం పడుతోంది. హిందూజా ప్రాజెక్ట్ షెడ్యూల్ కాకపోవడం సుప్రీంకోర్టుకు వెళ్లడంతో రూ.1,235 కోట్లు, విండ్-సోలార్ విద్యుత్ ఉత్పత్తిని వెనక్కి తీసుకోవడంతో అదనంగా రూ.500 కోట్లు భారం పడడంతో పాటు రూ.16,699 కోట్లు టారిఫ్ పెరిగింది. ట్రూ అప్ ఫ్యూయల్ పేరిట రూ.5,886 కోట్లు, ట్రూ అప్ ఛార్జెస్ కింద రూ.3,977 కోట్లు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద రూ.5,604 కోట్లు ఇలా అన్నీ కలిపి రూ.32,166 కోట్లు ప్రజలపై భారం వేశారు. ట్రూ అప్, ఫ్యూయల్ పదాలన్నీ కొత్తగా వింటున్నా.

గత ప్రభుత్వం మోపిన భారం పేదలపైనే ఎక్కువ పడింది. 1.53 కోట్ల కుటుంబాలు ఇబ్బంది పడ్డాయి. రూ.17,137 కోట్లు ట్రూ అప్, ఫ్యూయల్ లో ఇంకా పెండింగులో ఉన్నాయి. పేదలు, పెత్తందారు అని మాట్లాడుతాడు..ఆ పెత్తందారు చేసిన ఘనకార్యానికి పేదలు చితికిపోయిన పరిస్థితి ఏర్పడింది. అంతకుముందున్న రుణాలు రూ.62,826 కోట్లు, ఐదేళ్లలో రూ.1,12,422 కోట్లకు పెంచారు. ప్రభుత్వ సబ్సీడీ బకాయిలు కూడా పెరిగాయి. రూ.7,680 కోట్ల నుండి రూ.12,681 కోట్ల సబ్సీడీ పెండింగులో ఉన్నాయి. ప్రభుత్వ శాఖల్లో రావాల్సిన బకాయిలు కూడా రూ.5,265 నుండి రూ.15,157 కోట్లకు పెరిగింది. తెలంగాణ నుండి రూ.7,300 కోట్లు బకాయిలు ఉన్నాయి. బకాయిల రూపంలో మొత్తం రూ.52 వేల కోట్లు రావాల్సి ఉందని సీఎం వివరించారు. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు వారిపై భారం లేకుండా చేయాల్సిన బాధ్యత మాపై ఉంది. వీలైనంత త్వరగా విద్యుత్ రంగాన్ని గాడిలో పెడతాం. విద్యుత్ కోతల్లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకుంటామని చంద్రబాబు వివరించారు.

వెబ్ కౌన్సెలింగ్ పాట్లు

(మొదటిపేజీ తరువాయి)

స్పష్టత వచ్చాకే..చాలా మంది కౌన్సెలింగ్‌లో భాగస్వాములు కావాలని ఎదురు చూస్తున్నారు. మధ్యలో వెబ్ కౌన్సెలింగ్‌కు సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. ఏపీఈఏపీసెట్ కన్వీనర్ హెల్ప్‌లైన్ నంబర్లకు ఫోన్లు చేసి సమాచారం తెలుసుకునేందుకు ప్రయత్నించారు. మరికొందరు మెయిళ్ల ద్వారా సమాచారం పంపి, కన్వీనర్ కోటాలో ఆనవాయితీగా భర్తీచేసే ప్రైవేట్ యూనివర్సిటీల సీట్లను ఎందుకు చూపించలేదంటూ వివరణ కోరారు. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే ప్రైవేట్ యూనివర్సిటీల సీట్ల వివరాలను అందుబాటులో ఉంచుతామన్న సమాచారాన్ని వెబ్‌సైట్‌లో ఉంచారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో సీఎం జగన్ ఈ ప్రైవేట్ యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద 35శాతం సీట్లను ప్రవేశ పెట్టారు. గత నాలుగు విద్యా సంవత్సరాల నుంచి వీఐటి ఏపీ, ఎస్ఆర్ఎం ఏపీ, తిరుపతిలోని అపోలో, మోహన్‌బాబు యూనివర్సిటీలు, విశాఖలోని సెంచూరియన్ తదితర యూనివర్సిటీల్లో కన్వీనర్ కోటా కింద సీట్లను భర్తీ చేస్తున్నారు. ఈ విధంగా అన్ని వర్గాలకు చెందిన విద్యార్థులు కన్వీనర్ కోటాలో సీట్లు పొందారు. వారికి గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా కల్పించింది. అయితే 2014-25 విద్యా సంవత్సరానికిగాను పేరొందిన వీఐటీఏపీ, ఎస్ఆర్ఎం ఏపీ, విశాఖపట్నంలోని సెంచూరియన్, తిరుపతిలోని మోహన్‌బాబుతోపాటు కొత్తగా వచ్చిన కాకినాడ ఆదిత్య తదితర ప్రైవేట్ యూనివర్సిటీల సీట్లు వెబ్ కౌన్సెలింగ్‌లోకి భాగస్వామ్యం కాలేదు. కేవలం ప్రభుత్వ యూనివర్శిటీలు, ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలల సీట్లనే అందుబాటులో ఉంచారు. రాష్ట్ర వ్యాప్తంగా 234 ఇనిస్టిట్యూట్ల నుంచి ఆయా బ్రాంచీల్లో ఉన్న కన్వీనర్ కోటా సీట్లను వెబ్ కౌన్సెలింగ్‌లో ఉంచుతారు. ప్రభుత్వం నుంచి అనుమతి రాగానే ప్రైవేట్ యూనివర్సిటీల నుంచి మరిన్ని సీట్లు అందుబాటులోకి రానున్నాయి. ప్రైవేట్ యూనివర్సిటీలో 35 శాతం కన్వీనర్ కోటా సీట్లను యథాతథంగా అమలు చేయాలని విద్యార్థి, తల్లిదండ్రుల సంఘాల నేతలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

అభ్యర్థులు ఆప్షన్లు ఇలా ఇవ్వాలి...

ఏపీఈఏపీసెట్-2024లో ఫీజు చెల్లించి, తమ వివరాలను నమోదు చేసుకుని, ఆన్‌లైన్ ధ్రువీకరణ పత్రాలను విజయవంతంగా పూర్తయిన వారంతా వెబ్ ఆప్షన్లకు అర్హులు. ఏపీఈఏపీసెట్-2024 వెబ్‌సైట్‌లోని చివర ఉన్న వెబ్ ఆప్షన్లోకి వెళ్లి ఏపీఈఏపీసెట్ హాల్ టిక్కెట్ నంబరు, పుట్టిన తేదీతో లాగిన్ కావాలి. ఆ తర్వాత సెల్‌ఫోన్ నంబరు నమోదు చేసి, దాని ద్వారా వచ్చే ఓటీపీతో వెబ్ ఆప్షన్లలోకి వెళ్లాలి. తమకు వచ్చిన ర్యాంకులు, ప్రాంతం, రిజర్వేషన్ల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్‌లో అందుబాటులో ఉన్న ఇంజనీరింగ్ బ్రాంచిలు, వాటి సీట్ల సంఖ్యను అవగతం చేసుకోవాలి. ఏయూ, ఎస్వీయూ ప్రాంతాలకు చెందిన వారు సీట్లను ఎంచుకోవాలి. అనంతరం ప్రాధాన్యతా క్రమంలో ఆప్షన్లు పెట్టుకోవాలి. ఇలా ఆప్షన్లు పెట్టుకునే సమయంలో ప్రతి ఆప్షన్ ముగిశాక...సేవ్ అనేదీ మాత్రమే చేయాలి. ఆ పక్కనే కన్పించే ఫ్రీజ్ అనే ఆప్షన్‌ను మాత్రం టచ్ చేయకూడదు. ఒక్కసారి ఆప్షన్ ముగిశాక ఫ్రీజ్ అనే కాలమ్‌ను నొక్కితే అంతటితో మీ ఆప్షన్ల ప్రక్రియ ముగిసిపోతుంది. ఈనెల 12వ తేదీ వరకు వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్లు నమోదుకు అవకాశం కల్పించారు. 13వ తేదీన పెట్టుకున్న ఆప్షన్లలో మార్పులు, చేర్పులు చేసుకోవచ్చు. సెల్ఫ్‌ఫైనాన్స్ కోటా కింద ఉన్న ఇనిస్టిట్యూట్లకు ఫీజు రీయింబర్స్‌మెంట్ వర్తించబోదు.

అమెరికాలో నలుగురు తెలుగువారి అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

తీసుకున్నారు. ఈ నలుగురు సుమారు 100 మందిని నిర్బంధించి, తమ అక్రమ కంపెనీల్లో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. టెక్సాస్ రాష్ట్రంలోని గిన్స్‌బర్గ్ లేన్‌లోగల 1000 బ్లాక్‌లోని సంతోశ్ కట్కూరి ఇంట్లో అనుమానాస్పద కార్యకలాపాలు జరుగుతున్నట్లు ప్రిన్స్‌టన్ పోలీసులకు సమాచారం అందగా మార్చి 13న సీఐడీ తో కలిసి సోదాలు నిర్వహించారు. ఆ ఇంట్లో 15మంది యువతులను గుర్తించారు. వీరితో కట్కూరి దంపతులు వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు తెలుసుకున్నారు. సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, ప్రింటర్లు, కొన్ని ముఖ్య పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ప్రిన్స్‌టన్‌తో పాటు మెలీసా, మెక్‌కిన్నీ తదితర ప్రాంతాల్లోనూ వీరి అధ్వర్యంలో కొందరితో వెట్టిచాకిరి చేయిస్తున్నట్లు విచారణలో తేలింది. దీంతో ఆయా ప్రాంతాల్లోనూ తనిఖీలు నిర్వహించి, ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లు, పత్రాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. డొల్ల కంపెనీలు నడుపుతూ మానవ అక్రమ రవాణా సాగిస్తున్నట్లు ధ్రువీకరించుకున్నారు. చందన్ దాసిరెడ్డి, అనిల్ మాలే సహకారంతో కట్కూరి దంపతులు ఈ వ్యవహారాన్ని నడుపుతున్నట్లు గుర్తించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని మానవుల అక్రమ రవాణా, గృహ నిర్బంధ కేసులు నమోదు చేశారు.

వెన్నెల కుటుంబాన్ని ఆదుకోండి

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నారాయణ విజ్ఞప్తి

విశాలాంధ్ర-హైదరాబాద్: వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్‌కు చెందిన వెన్నెలను, ఆమె కుటుంబాన్ని ఆదుకోవాల్సిందిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టరు కె. నారాయణ విజ్ఞప్తి చేశారు. భారతదేశ నుంచి ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల నుంచి పై చదువులకు విద్యార్థులు విదేశాలకు వెళుతున్నారనీ, ఎక్కువమంది అమెరికాకు, తర్వాత కెనడా, జర్మనీ, ఆస్ట్రేలియా తదితర దేశాలకు వెళ్తున్నారన్నారు. చదువుకోవడానికి వెళ్లినా లేదా ఉద్యోగం చేయడానికి వెళ్లినా అక్కడ వారికి ఇన్సూరెన్స్ క్లెయిమ్ అవుతుంది. కానీ చదువు పూర్తయిన తర్వాత పార్ట్ టైం ఉద్యోగం చేస్తూ, మరొక ఉద్యోగం కోసం వెతుక్కునేవారు ఎక్కువమంది అక్కడ ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. బీమా లేకుండా ప్రమాదానికి గురైన వారు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తున్నదని ఆందోళన వ్యక్తంచేశారు. కోట్ల రూపాయల్లో హాస్పిటల్ ఖర్చులు చెల్లించాల్సి వస్తోందన్నారు. ఈ విషయమై ప్రధానమంత్రికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖలు రాసినట్టు తెలిపారు. ప్రమాదానికి గురైన వారిని ఆదుకోవాల్సిందిగా తానాకు కూడా విజ్ఞప్తి చేసినట్టు తెలిపారు. ప్రధాన మంత్రి చొరవ తీసుకొని విదేశాల్లో ఉండి ఇబ్బందులకు గురయ్యే భారతీయ విద్యార్థులను రక్షించడానికి భారత ప్రభుత్వం నిర్మాణపూరితంగా అధికారులతో ఒక సెల్ ఏర్పాటు చేయాలి. గతంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు గల్ఫ్ దేశాల్లో ఇలాంటి సమస్య వచ్చింది. తాను ముఖ్యమంత్రికి ప్రాతినిధ్యం చేయగా అప్పటి విద్యాశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో ఒక్క కమిటీ ఏర్పాటు చేసి, వారిని విదేశాలకు పంపి బాధితులను ఆదుకోనున్నట్టు విదేశాల్లో చదువుకుంటున్న విద్యార్థులు తాత్కాలిక ఉద్యోగాలు చేసి ఎంతో కొంత సంపాదించి భారతదేశంలో ఉన్న వారి తల్లిదండ్రులకు పంపడం జరుగుతున్నది. ఇక్కడ ఆ డబ్బులు ఖర్చు పెడుతున్నారు. దీంతో ప్రభుత్వాలకు ప్రత్యక్షంగా పరోక్షంగా పన్నుల రూపంలో ఆదాయం సమకూరుతోంది. ప్రస్తుతం వరంగల్ జిల్లా స్టేషన్ ఘనపూర్ చెందిన వెన్నెల అనే అమ్మాయి ప్రమాదానికి గురై గత రెండు నెలలుగా కోమాలో ఉన్నది. వారిది చాలా పేద కుటుంబం. ఇలాంటి వారిని కాపాడవలసిందిగా భారత ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి నారాయణ విజ్ఞప్తి చేశారు.

సీనియర్ కమ్యూనిస్టు కోదాటి మల్లికార్జునరావుకు సత్కారం

విశాలాంధ్ర-మచిలీపట్నం: భూ పోరాట యోధుడు, సముద్ర తీర బంజర భూములు 5000 మంది పేదలకు పంపిణీ చేయించిన మహోన్నత నేత, ఆదర్శ కమ్యూనిస్టు అమరజీవి మోదుమూడి శ్రీహరి రావు 25వ వర్ధంతి సందర్భంగా షెడ్ వర్కర్స్ యూనియన్ వ్యవస్థాపక అధ్యక్షుడు, సీపీఐ, చేనేత కార్మిక సంఘం నాయకులు కోదాటి మల్లికార్జునరావుకు సత్కారం జరిగింది. 90ఏళ్ల పైబడిన వయసులో కూడా కోదాటి మల్లికార్జునరావు కమ్యూనిస్టు పార్టీ పటిష్టతకు తహతహలా డుతున్నారు. విశాలాంధ్ర చందాదారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమాలకు తనవంతు ఆర్థిక చేయూతను అందిస్తున్నారు. మల్లికార్జునరావును సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె. రామకృష్ణ కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ చేతుల మీదగా పదివేల రూపాయలను బహుకరించి నూతన వస్త్రాలతో సన్మానించారు. ఈ మొత్తాన్ని సీపీఐ జిల్లా సీనియర్ నాయకులు మోదుమూడి రామారావు అందజేశారు.

విద్యుత్ శాఖలో అక్రమాలపై చర్యలు

చంద్రబాబుకు ఈశ్వరయ్య లేఖ

విశాలాంధ్ర-విజయవాడ: విద్యుత్ సంస్థల్లో జరిగిన, జరుగుతున్న అక్రమాలపై మంగళవారం ప్రభుత్వం విడుదల చేసిన శ్వేతపత్రంలో వెలుగులోకి వచ్చిన పోస్టింగుల అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జి.ఈశ్వరయ్య లేఖ రాశారు. ఏపీ ఎస్పీడీసీఎల్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు కంప్యూటర్ ఆపరేటర్లకు మాత్రం ఇన్వెన్షన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా చెల్లిస్తూ, సబ్‌స్టేషన్ ఆపరేటర్లకు సబ్‌స్టేషన్లను మెయింటినెన్స్ చూస్తున్న కాంట్రాక్టర్లకు అప్పగించేవారిని తెలిపారు. గత ప్రభుత్వంలో కొంతమంది ఉన్నతాధికారులు వారి స్వప్రయోజనం కోసం మొత్తం అవుట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులందరికీ ఇన్వెన్షన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ద్వారా జీతాలు చెల్లించే విధంగా చేసి, ఆ కంపెనీకి లబ్ధి చేకూర్చి తద్వారా వారు కూడా భారీ మొత్తంలో లబ్ధి పొందారన్నారు. తరువాత మొత్తం సాఫ్ట్‌వేర్ అప్‌డేషన్లు, ఎస్ఏపీ, ఐటీ మెయింటెనెన్స్ మీటర్ల ట్రాకింగ్, బిల్లింగ్, కలెక్షన్, బిల్ పేమెంట్ మొదలైన చాలా పనులన్నీ ఇన్వెన్షన్స్ టెక్నాలజీస్ ద్వారానే చేయిస్తామని వారి కంపెనీకి సంబంధించిన 40 మందిని హై స్కిల్డ్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లను ఇక్కడ నియమించి డిస్కం డెవలప్మెంట్‌కు కృషి చేస్తామని అందుకుగాను సంవత్సరానికి ఆరు కోట్ల రూపాయలు చెల్లించే విధంగా అగ్రిమెంట్ చేసుకోవడం జరిగిందన్నారు. ఎస్పీడీసీఎల్‌లో పనిచేస్తున్న హైస్కిల్డ్ పర్సన్స్‌ని కొంతమందిని వారి కంపెనీలోకి చూపించి వారికి రూ.50 వేల నుండి రూ.60 వేలు జీతాలు చెల్లిస్తూ మిగిలిన వారిని కనీసం నాలెడ్జ్ కూడా లేని కొంతమందిని రిక్రూట్ చేసుకొని వారికి 20 వేల నుంచి 30 వేల రూపాయలు జీతం చెల్లిస్తూ అందరికీ నెలకి లక్ష నుండి లక్షా యాభై వేల రూపాయలు చెల్లిస్తున్నట్లు చెప్పి, ఎస్పీడీసీఎల్ నుండి మాత్రం సంవత్సరానికి 6 కోట్లు రూపాయలను డ్రా చేయడం జరిగిందన్నారు. ఎస్పీడీసీఎల్ నుంచి డ్రా చేస్తున్న ఈ మొత్తంలో ఎస్పీడీసీఎల్ అధికారులకు పెద్ద మొత్తంలో ఇన్వెన్షన్స్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ నుంచి మధ్యవర్తిగా ఉన్న ప్రతాప్ ద్వారా అందుతూ ఉన్నాయన్నారు. ఈ ప్రతాప్ ఇక్కడ పనిచేస్తున్న సీఎండీలు, డైరెక్టర్లు, చీఫ్ జనరల్ మేనేజర్లు, కొంతమంది ఉద్యోగ సంఘాల నాయకులకు, సీఎండీ పేషీ పనిచేస్తున్న అధికారులకు అనేక విధాలుగా లబ్ధి చేకూర్చే విధంగా ఉంటూ అనేక అక్రమాలకు పాల్పడ్డారని తెలిపారు. ఇదే విధమైన అవినీతి ఇతర డిస్కంలో కూడా వీరి ద్వారానే జరుగుతుందన్నారు. వాటిపై కూడా సమగ్ర విచారణ జరిపించాల్సిందిగా కోరారు. విద్యుత్ సంస్థల్లో కొందరు అత్యంత అవినీతి సామ్రాట్లుగా వెలుగొందుతున్నారని విమర్శించారు. సంస్థల్లో గతంలో పనిచేసిన సీఎండీ మొదలుకొని అన్ని జిల్లాలలో పై స్థాయి అధికారులు, కింది స్థాయి అధికారుల వరకు కొంత మంది రైతుల రక్త మాంసాలను పీల్చుకొని కోట్ల రూపాయలు దోచుకుంటున్నారని చెప్పారు. వీటన్నింటిపై సమగ్రమైన విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.

మార్క్సిస్టు దృక్పథాన్ని అలవర్చుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

విశాలాంధ్ర-కాకినాడ: మార్క్సిస్టు దృక్పథాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ సూచించారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణా తరగతులకు హాజరైన విద్యార్థి నాయకులను అభినందించారు. రాజకీయాల్లోకి రావాలని, అవినీతికి తావులేకుండా చేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత జాతీయ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులను వివరించారు. కడప ఉక్కు పరిశ్రమ స్థాపన కోసం రెండు సార్లు శంకుస్థాపన చేశారని, ఒక్క ఇటుక కూడా పెట్టలేదని విమర్శించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం విభజన హామీల అమలు కోసం జగన్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని, అందుకోసమే ఘోరంగా ఓడిపోయిందని దుయ్యబట్టారు. ఎన్డీయే అధికారంలోకి వచ్చిన క్రమంలో రాష్ట్ర అభివృద్ధికి పెద్దపీట వేయాలని, విభజన హామీల అమలు, రాష్ట్రాన్ని రావాల్సినవన్నీ వసూలు చేయాలని కోరుతున్నట్లు వెల్లడించారు. కేంద్రప్రభుత్వ మతోన్మాద ధోరణితో ప్రజలను విభజిస్తూ, సమస్యలు తెస్తోందన్నారు. బీజేపీ దుర్మార్గాలను ఇండియా ఐక్య సంఘటన తిప్పికొడుతున్నట్లు రామకృష్ణ వెల్లడించారు. తరగతుల రెండవ రోజు మొదటి సెషన్ భారత చరిత్ర, సంస్కృతి, వక్రీకరణపై ఇండియన్ జర్నలిస్టు యూనియన్ (ఐజేయూ) కార్యవర్గ సభ్యులు డి.సోమసుందర్ బోధించారు. చరిత్ర -సంస్కృతి వక్రీకరణపై విశిష్టమైన సందేశాన్నిచ్చారు. అనంతరం నేటి రాజకీయాలు-ప్రత్యామ్నాయం అనే అంశంపై సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి, 'మూఢనమ్మకాలు, సామాజిక రుగ్మతలు' అంశంపై పెన్మత్స సుబ్బరాజు బోధించారు. నేటి రాజకీయాలు దానికి ప్రత్యన్నాయ మార్గాల గురించి అవగాహన కల్పించారు. పేదరికం, ఆకలి లేని వ్యవస్థ నిర్మించడమే అభివృద్ధి అని నొక్కిచెప్పారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శి జాన్సన్ బాబు, శివారెడ్డి పాల్గున్నారు.

అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

- లేకుంటే మళ్లీ ఆందోళన
- ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఓబులేసు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్, మినీ వర్కర్స్‌కు ఇచ్చిన హామీ మేరకు వేతనాలు పెంచడంతో పాటు ఇతర సమస్యలు చర్చించి పరిష్కరించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఏపీ అంగన్‌వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఏఐటీయూసీ అనుబంధం)నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టే ప్రతి పథకం విజయవంతం చేయటానికి అంగన్‌వాడీలు ఎంతో శ్రమకోర్చి పనిచేస్తున్నారన్నారు. రోజు రోజుకు పని భారం పెరుగుతూ మూడు నుంచి నాలుగు యాప్స్ ద్వారా గర్భవతులు, బాలింతలు, పిల్లలకు సేవ చేస్తున్నప్పటికీ వారికి కనీస వేతనాలు ఇవ్వకుండా ఎలాంటి సౌకర్యాలు లేకుండా కేవలం వర్కర్స్‌కి రూ.11,500, హెల్పర్స్, మినీ వర్కర్స్ కి రూ.7000 ఇస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. విపరీతంగా పెరిగిన నిత్యావసర సరుకుల ధరలు పెరగడంతో అంగన్‌వాడీ కుటుంబాలపై మోయలేని భారం పడుతోందన్నారు.వారి సమస్యలు పరిష్కరించాలని అనేక పర్యాయాలు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు విన్నవించినప్పటికీ పరిష్కారం కాలేదన్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో గత ఏడాది డిసెంబర్12 నుండి జనవరి22 వరకు రాష్ట్రంలో సోదర సంఘాలను కలుపుకొని అంగన్వాడీ కేంద్రాలన్నింటిని మూసివేసి, 56వేల సెంటర్ల సిబ్బంది అన్ని జిల్లాల్లో పూర్తిస్థాయి సమ్మెలో పాల్గొనడం జరిగిందన్నారు. ఆ సమయంలో ప్రతి పక్షంలో ఉన్న చంద్రబాబుతో పాటు ఇతర నాయకులు తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. తక్షణం వారి ప్రధాన సమస్య అయిన వేతనాలు పెంచాలని ఓబులేసు డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాల్సి ఉన్నప్పటికీ గత ప్రభుత్వం రాష్టాన్ని అన్ని రకాలుగా నాశనం చేయటం వల్ల ఆర్థిక పరిస్థితి బాగోలేదని... అందుకని తెలంగాణాలో ఇస్తున్న మాదిరిగా రూ.13,500 వేతనం ఇవ్వాలన్నారు. ఈఎస్ఐ,పెన్షన్ గ్రాట్యుటీ, ఇన్సూరెన్స్, ఇతర సౌకర్యాలు కల్పించాలన్నారు. అలాగే అనేక రకాల యాప్‌ల వలన అంగన్‌వాడీలు ఇబ్బందులు పడుతున్నారని ఒకే యాప్ కొనసాగించాలన్నారు. సెంటర్లకు సంబంధించి గ్యాస్, సంపూర్ణ పోషణ, కరెంటు బిల్లులు ప్రతినెలా చెల్లించాలన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక టీడీపీ నాయకులు... మా ప్రభుత్వం అధికారంలో ఉంది కనుక తమ వారిని పెట్టుకుంటామని కక్షసాధింపు చర్యలు చేస్తున్నారని ముఖ్యంగా కింది స్థాయిలో మధ్యాహ్న భోజన పథకంలో పనిచేసేవారు, స్కూల్ అయాలు,ఆశా వర్కర్స్‌లను 'మీరు ఇళ్లకు వెళ్లిపోండి మీ స్థానంలో మా వాళ్లని పెట్టుకుంటాం' అని ఒత్తిడి చేయడం సరైన పద్ధతి కాదని హెచ్చరించారు. చంద్రబాబు ప్రభుత్వం తక్షణం అంగన్‌వాడీల సమస్యలు పరిష్కారం చేయాలని లేకుంటే మరలా అందోళన తప్పదన్నారు. అయితే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లటానికి అధికారులకు సమయం ఇచ్చామని మరోనెల రోజుల తరువాత భవిష్యత్తు కార్యచరణ చేపడతామని ఓబులేసు పేర్కొన్నారు. ఏపీ అంగన్‌వాడి వర్కర్స్ హెల్పర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జె.లలిత, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కె.ప్రేమ మాట్లాడుతూ... అనాడు తాము చేసిన సమ్మెకు మద్దతుగా వచ్చిన టీడీపీ నాయకులు ఇచ్చిన హామీ మేరకు తక్షణమే సమస్యలు పరిష్కరించాలన్నారు. మా ప్రధానమైన డిమాండ్ రూ. 26 వేలు కనీస వేతన ఇవ్వాలని, గ్రాట్యూటీ అమలు చేయాలన్నారు. మినీ సెంటర్లన్నీ కూడా మెయిన్ సెంటర్లు చేయాలన్నారు. విధుల్లో చనిపోయిన వారికి ఐదు లక్షల రూపాయలు ఇవ్వాలని, విధుల్లో ఉండగా చనిపోయిన వారి కుటుంబంలో ఒకరి ఉద్యోగం ఇవ్వాలన్నారు. చంద్రబాబు ప్రభుత్వం త్వరలో తమతో సమావేశం ఏర్పాటు చేసి తమ న్యాయమైన కోర్కెలను అమోదించాలన్నారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్యక్షురాలు ఎస్.మంజుల, రాష్ట్ర నాయకురాలు జె.హెల్డా, అనిత, సరళ, చౌడేశ్వరి, శాంతి, సరోజమ్మ, సారమ్మ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా ప్రాజెక్టులపై విచారణ వాయిదా

అఫిడవిట్ ఇవ్వాలని కేంద్రానికి సుప్రీం ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణానది పరివాహక ప్రాంతంలోని ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకువచ్చే అంశంపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టుల నుంచి విద్యుత్ ఉత్పత్తి, ఇతర అవసరాలకు అనుమతులు లేకుండా నీటిని వినియోగిస్తున్న విషయంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. ఆ పిటిషన్‌ను జస్టిస్ అభయ్ ఎస్ ఓఖా, జస్టిస్ అగస్టీన్ జార్జి మాసి నేతృత్వంలోని ధర్మాసనం మంగళవారం విచారించింది. ఈ విషయంపై కేంద్రం నుంచి తగిన ఆదేశాలు తీసుకుని తాజాగా అఫిడవిట్ దాఖలు చేస్తామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటియా కోర్టుకు తెలిపారు. కృష్ణా పరివాహక ప్రాజెక్టులను కేఆర్ఎంబీ పరిధిలోకి తీసుకురావడం తమకు సమ్మతమేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలోనే తెలియజేయగా, ఇదే అంశంపై విముఖత వ్యక్తం చేస్తూ తెలంగాణ ప్రభుత్వం అఫిడవిట్ దాఖలు చేసింది.ఈ నేపథ్యంలో రెండు ప్రభుత్వాల అభిప్రాయాలకు అనుగుణంగా కేంద్రం నిర్ణయం తీసుకోవాల్సి ఉందని ఇరు రాష్ట్రాల న్యాయవాదులు తెలిపారు. అయితే నోటిఫికేషన్ జారీ చేయడానికి కొన్ని సాంకేతిక కారణాలు ఉన్నాయని కృష్ణానదీ నీటి యాజమాన్య సంస్థ (కేఆర్ఎంబీ) తరపు అదనపు సొలిసిటర్ జనరల్ తెలిపారు. ఈ విషయంలో కేంద్రం నుంచి తగిన సూచనలు, ఆదేశాలు తీసుకోవాల్సి ఉందని కోర్టుకు వివరించారు. ఈ వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం తదుపరి విచారణను ఆగస్టు 20వ తేదీకి వాయిదా వేసింది. ఆ లోపు అఫిడవిట్ దాఖలు చేయాలని కేంద్రానికి ఆదేశాలు జారీ చేసింది.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

ఏఐటీయూసీ డిమాండ్

విశాలాంధ్ర-విజయవాడ: అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చొరవ చూపాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీ ఓబులేసు అన్నారు. స్థానిక గొల్లపూడిలోని జోస్యభట్ల సత్యనారాయణ భవన్‌లో మంగళవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం కే ప్రేమ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఓబులేసు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల పనిభారం రోజురోజుకు పెరుగుతున్నా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. అంగన్‌వాడీలకు రూ.11,500, హెల్పర్లకు రూ. ఏడువేలు ఇస్తూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయన్నారు. నిత్యావసరాల పెరుగుదలతో ఆయా కుటుంబాలపై పెనుభారం పడుతుందన్నారు. పార్లమెంట్, అసెంబ్లీ సమావేశాల సందర్భంగా కనీస వేతనాలు, ఈఎస్ఐ, పెన్షన్ , గ్రాట్యూటీ, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని పోరాటాలు చేసినప్పటికీ ప్రభుత్వాలు పెడచెవిన పెట్టాయని విమర్శించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జే లలితమ్మ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి అనేక పర్యాయాలు అధికారులకు విన్నవించినప్పటికీ పరిష్కారంలో జాప్యం చేశారన్నారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, సంక్షేమ పథకాలన్నీ వర్తింపచేయాలని, ప్రస్తుత యాప్స్‌ను తీసివేసి పాత పద్ధతిని అమలు చేయాలని, బకాయిలు చెల్లించాలని కోరారు. తొలుత జె. లలిత కార్యదర్శి నివేదిక సమర్పించారు. అసోసియేషన్ రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు మంజుల, వర్కింగ్ ప్రెసిడెంట్ కే ప్రేమ పాల్గొన్నారు.

'పాలిసెట్' తుది దశ నోటిఫికేషన్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్రంలో పాలిటెక్నిక్ ప్రవేశాలకోసం తుది దశ నోటిఫికేషన్ విడుదల చేసినట్లు సాంకేతిక విద్యా శాఖ సంచాలకురాలు డాక్టర్ బి.నవ్య తెలిపారు. ఏపీ పాలిసెట్-2024లో అర్హత పొంది డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం ఆసక్తి ఉన్న విద్యార్థులు వెబ్ ఆధారిత కౌన్సెలింగ్ కోసం దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ పద్ధతిలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, సర్టిఫికేట్ ధృవీకరణ, ఎంపికల నమోదు ప్రక్రియల కోసం ఈనెల 11 నుంచి 14 వరకు సమయం కేటాయించామన్నారు. 16న సీట్ల కేటాయింపు ఉంటుందన్నారు. పూర్తి వివరాలు, షెడ్యూల్ కోసం ఏపీ పాలిసెట్.ఎన్ఐసి.ఇన్ వెబ్‌సైట్‌లోని వివరణాత్మక నోటిఫికేషన్ పరిశీలించాలని ఆమె స్పష్టంచేశారు.

పోరాటాలలో సీపీఐ కీలకం

- అనేక ఉద్యమాల్లో గర్వించదగిన పాత్ర నిర్వహించాం
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: గడచిన ఐదేళ్లలో రాష్ట్రంలో కార్మిక, రైతు హక్కుల కోసం, ప్రభుత్వ నిర్బంధాలకు వ్యతిరేకంగా సాగిన అనేక పోరాటాలలో సీపీఐ కీలక పాత్ర వహించిందని ఆ పార్టీ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన వీడియో సందేశాన్ని ఆయన విడుదల చేశారు. రాష్ట్ర రాజకీయాలను మలుపుతిప్పిన అమరావతి ఉద్యమ నేతలు, మహిళలకు, ఉద్యమంలో పాల్గొన్న అన్ని రాజకీయ పార్టీల కార్యకర్తలకు సీపీఐ పక్షాన జే జేలు పలుకుతున్నామన్నారు. వందల కేసుల్లో ఉన్న మహిళా ఉద్యమ కార్యకర్తలు, రైతుల జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులతో పాటు శివారెడ్డి, తిరుపతిరావు, కొలికలపూడి శ్రీనివాసరావు, సుధాకర్, స్వరాజ్యరావు తదితర ప్రముఖులు రాజధాని ఉద్యమంలో గర్వించదగిన పాత్ర నిర్వహించారని కొనియాడారు. గత ఐదేళ్ల కాలంలో అమరావతి రైతు ఉద్యమంతో పాటు విశాఖ ఉక్కు ఉద్యమం, పోలవరం ప్రాజెక్టు ఉద్యమం, కడప స్టీల్ ఫ్యాక్టరీ ఉద్యమం, రామయపట్నం పోర్టు, ప్రత్యేక హోదా తదితర ఉద్యమాలలో ఇతర పార్టీల కన్నా గర్వించదగిన పాత్రను సీపీఐ పోషించిందన్నారు. త్రికరణ శుద్ధిగా అంకితభావంతో పనిచేసిందని గుర్తుచేశారు. ఇటువంటి పోరాటాలలో తాను కూడా భాగస్వామిగా ఉండి ఎన్నో కేసులలో ముద్దాయిగా ఉన్నందుకు ఎంతో గర్వపడుతున్నానన్నారు. అమరావతి రాజధాని నిర్మాణానికి ప్రభుత్వాలు తీసుకునే మంచి నిర్ణయాలకు సీపీఐ మద్దతు ఎప్పుడూ ఉంటుందని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 26 జిల్లాలకు అమరావతి కేంద్ర బిందువు అనే విషయాన్ని గమనంలో పెట్టుకుని, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అన్ని జిల్లాలకు వచ్చేలా రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతి నిర్మాణ బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉందని ముప్పాళ్ల స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం గతంలో మాదిరిగా మోసపూరిత వైఖరితో కాకుండా చిత్తశుద్ధితో రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీకి ఏపీ రైతు సంఘాల ప్రతినిధులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రైతు సంఘాల సమన్వయ సమితి (ఎస్‌కేఎం) సమావేశానికి రాష్ట్రం నుంచి ప్రతినిధుల బృందం వెళ్లింది. ఢిల్లీలో హరికిషన్ సింగ్ సూర్జిత్ భవన్‌లో బుధవారం ఎస్‌కేఎం సమావేశం జరగనుంది. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీవీ ప్రసాద్, రైతు సంఘం నాయకులు ఎం.సూర్యనారాయణ, డి.హరినాథ్, కోట ఆంజనేయులు, లక్ష్మణబాబు తదితరులు తరలివెళ్లారు. జాతీయ స్థాయిలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమగ్రంగా చర్చిస్తారు. ప్రధానంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ఆధారంగా పంటల మద్దతు ధరల చట్టం, రుణ విమోచనం చట్టం కల్పించాలన్న డిమాండ్లతో కేంద్రంపై సమావేశం ఒత్తిడి పెంచనుంది. అనంతరం భవిష్యత్ కార్యాచరణను రూపొందిస్తారు.

విద్యాహక్కు చట్టం పటిష్ఠం చేయాలి

మంత్రి లోకేశ్‌కు ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: విద్యా హక్కు చట్టం-2009 పటిష్ఠంగా అమలు చేయకుండా రాష్ట్రంలో ప్రైవేటు పాఠశాల యాజమాన్యం, వారికి తోడుగా విద్యాశాఖ అధికారులు నిర్వీర్యం చేస్తున్నారని ఏపీ పేరెంట్స్ అసోసియేషన్ తెలిపింది. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు అసోసియేషన్ నేతలు కె.మల్లిరెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.నరహరి, కార్యదర్శి జి.ఈశ్వరయ్య మంగళవారం ఓ లేఖ రాశారు. విద్యా హక్కు చట్టంకు వ్యతిరేకంగా ప్రవేశాలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఇతర ఫీజులు చెల్లించాలంటూ విద్యార్థుల తల్లిదండ్రులపై ఒత్తిడిచేసి మరీ కట్టించుకుంటున్నారని పేర్కొన్నారు. వాటి అనుమతి కోసం తల్లిదండ్రుల నుంచి అంగీకార పత్రం తీసుకోవడం తగదన్నారు. విద్యాహక్కు చట్టం అమలులో అలసత్వం వహిస్తున్న జిల్లాల్లోని విద్యాశాఖ అధికారులపైన, చట్ట వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న పాఠశాల యాజమాన్యాలపైన కఠిన చర్యలు తీసుకోవాలని, విద్యాహక్కు చట్టం పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అసెంబ్లీ కార్యదర్శి రామాచార్యులు రాజీనామా

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: అసెంబ్లీ సెక్రటరీ జనరల్ రామాచార్యులు మంగళవారం తన పదవికి రాజీనామా చేశారు. గత ప్రభుత్వ హయాంలో రామాచార్యుల నియామకం జరిగింది. వాస్తవానికి ఆయన రిటైర్ అయ్యారు. గత ప్రభుత్వం ఆయనని కొనసాగించింది. రిటైర్ అయిన తర్వాత కొనసాగుతున్న అధికారులు రాజీనామా చేయాలని కూటమి ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ మేరకు సర్క్యులర్ జారీ చేసింది. దాంతోపాటు అసెంబ్లీ నిర్వహణలో రామాచార్యుల వ్యవహారశైలిపై విమర్శలు వచ్చాయి. ఆయన తీరుపై తెలుగుదేశం పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు ఆగ్రహంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం తన పదవికి రాజీనామా చేసిన రామాచార్యులు, రాజీనామాను శాసనమండలి చైర్మన్ మోసెన్ రాజు, శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడికి అందజేశారు.

12, 13 తేదీల్లో సీపీఎం విస్తృతస్థాయి సమావేశాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఈనెల 12,13 తేదీల్లో వడ్డేశ్వరం లోని సుందరయ్య స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో సీపీఎం రాష్ట్ర విస్తృత సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12వ తేదీ ఉదయం 10గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని, ఈ సమావేశానికి పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు, ఎంఏ బేబి హాజరవుతారని వివరించారు. రాష్ట్రంలో అన్ని జిల్లాల నుంచి 300 మంది ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో 2024 పార్లమెంటు, రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలపై సమీక్ష, ప్రస్తుత రాజకీయ పరిస్థితి, రాష్ట్రంలో పార్టీ స్వతంత్ర ప్రజా పునాదిని పెంచుకోవడంతోపాటు భవిష్యత్ కర్తవ్యాలను రూపొందిస్తామని తెలిపారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్ రాజీనామా ఆమోదం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ హేమచంద్రారెడ్డి రాజీనామాను ప్రభుత్వం ఆమోదించింది. జేఎన్టీయూ(అనంతపురం)లో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న హేమచంద్రారెడ్డిని వైసీపీ ప్రభుత్వ హయాంలో ఉన్నత విద్యామండలి చైర్మన్‌గా నియమించారు. సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆయన తన పదవికి రాజీనామా చేసి, తక్షణమే తనను బాధ్యతలనుంచి తప్పించాలని ఉన్నతాధికారులను కోరారు. అందుకు ప్రభుత్వం అంగీకరించలేదు. అనంతరం ఆయన నెల రోజులపాటు సెలవుపై వెళ్లిపోయారు. ఈ మేరకు హేమచంద్రారెడ్డి రాజీనామాను ఆమోదిస్తూ ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి సౌరబ్ గౌర్ ఉత్తర్వులు జారీజేశారు.

పాఠశాల విద్యకు రూ.11వేల కోట్ల బడ్జెట్ అంచనాలు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న 2024-25 ఓటాన్ అకౌంట్ బడ్జెట్ నిమిత్తం రూ.11వేల కోట్ల అంచనాలను పాఠశాల విద్యశాఖ ప్రతిపాదించింది. ఈ మేరకు పాఠశాల విద్య సెక్రటరీ కోన శశిధర్ మంగళవారం ఉత్తర్వులు జారీజేశారు. మోడల్ స్కూల్ విద్యార్థుల తోపాటు పాఠశాల విద్య అవసరాలకు వాటిని వినియోగించనున్నారు.

సంపాదకీయం

మోదీ ప్రభుత్వ ప్రగల్భాలు దూసుకొస్తున్న తీవ్రవాదులు

మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత 2016లో పెద్దనోట్ల రద్దులో ప్రధాన ఉద్దేశం తీవ్రవాదాన్ని అణచడం అని కూడా అని చెప్పారు. 2019 ఆగస్టు అయిదున జమ్మూ-కశ్మీర్‌కు వర్తించే రాజ్యాంగంలోని 370వ అధికరణ రద్దు ముఖ్యోద్దేశం కూడా ఆ ప్రాంతంలో తీవ్రవాదాన్ని అణచి వేయడమేనని మోదీ సర్కారు తెగ ప్రచారం చేసుకుంది. ఈ రెండింటివల్ల జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాదం తగ్గిన జాడలే కనిపించడం లేదు. సోమవారం జమ్మూ-కశ్మీర్ లోని కథువా జిల్లాలో సైన్యంపై తీవ్రవాదులు చేసిన ఆకస్మిక దాడిలో అయిదుగురు భారత జవాన్లు నేలకొరిగారు. సైనికుల వాహన శ్రేణిపై తీవ్రవాదులు రెండువేపుల నుంచి దాడి చేశారు. గ్రెనేడ్లు విసిరారు. తీవ్రవాదులు కొండమీద నుంచి సునాయాసంగా దాడి చేయగలిగారు. సైనిక వాహనాలు కొండ కింద నుంచి వెళ్తుండగా ఈ ఆకస్మిక దాడి జరిగింది. ఇంతస్థాయిలో కాకపోయినా జమ్మూ-కశ్మీర్ లో తీవ్రవాదుల ఆగడాలు అనుదినం జరుగుతూనే ఉన్నాయి. అంటే పెద్దనోట్ల రద్దువల్ల, 370వ అధికరణం రద్దువల్ల తీవ్రవాదాన్ని అడ్డుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఇలాంటి దాడులు జరిగినప్పుడల్లా కేంద్ర హోం మంత్రి అమిత్ షా, రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అంతకంత ప్రతీకారం తీర్చుకుంటామని ప్రగల్భాలు పలుకుతుంటారు. కానీ అలాంటి ఛాయలే కనిపించవు. భారత సైన్యాధిపతి జనరల్ ఉపేంద్ర ద్వివేది నాలుగురోజుల కిందే ఆ ప్రాంతంలో పర్యటించి వచ్చారు ఆ వెంటనే తీవ్రవాదులు పంజా విసరడం అత్యంత ఆందోళనకరం. ప్రతీకారం తీర్చుకుంటాం అని దాడి జరిగిన ప్రతిసారీ ప్రభుత్వ పెద్దలు గంభీరమైన ప్రకటనలు జారీ చేస్తుంటారు. ఎప్పుడు చూసినా సర్జికల్ స్ట్రైక్‌లు, బాలకోట్ దాడి గురించే ప్రస్తావిస్తుంటారు. పుల్వామాలో దాదాపు 40 మంది భద్రతా దళాలను బలిపెట్టిన తీరు గురించి ఆ రాష్ట్ర గవర్నర్‌గా పనిచేసిన సత్పాల్ మాలిక్ గుట్టు విప్పినా మోదీ ప్రభుత్వం నుంచి ఒక్క సమాధానం కూడా లేదు. "ఇంట్లో చొరబడి కొడ్తాం" అన్న మోదీ హెచ్చరికలు ఏమైనాయో తెలియదు. జమ్మూ-కశ్మీర్ కు వర్తించే 370వ అధికరణాన్ని రద్దుచేయడంవల్ల మేలు జరిగిన దాఖలాలే లేవు. పైగా ప్రజాభిప్రాయం వ్యక్తం కాకుండా మోదీ సర్కారు సకల కట్టుదిట్టాలూ చేసింది. చీటికి మాటికి రోజుల తరబడి ఇంటర్నెట్ సదుపాయం లేకుండా చేస్తోంది. అంటే సమాచారాన్ని అడ్డుకుంటోంది. గత పదేళ్ల కాలంలో మోదీ ప్రభుత్వం పాక్ ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకుంటామని బీరాలు పలుకుతోంది. ఈసారి ఆ పనిచేసి తీరతామని ఇప్పటికీ చెప్తున్నారు. సంపూర్ణమైన మెజారిటీ ఉన్నప్పుడే జరగనిపని అత్తెసరు మార్కులతో గట్టెక్కిన మోదీ సర్కారుకు ఆక్రమిత కశ్మీర్‌ను స్వాధీనం చేసుకునే శక్తి ఎక్కడి నుంచి వస్తుందో తెలియదు. తమ నెలవులు వదిలి వచ్చిన కశ్మీరీ పండితులను మళ్లీ సొంత గూటికి పంపించేస్తామని మోదీ అధికారంలోకి రాకముందు కూడా బీజేపీ హామీల మీద హామీలు పడేసింది. ఇంతవరకు ఎంత మంది కశ్మీరీ పండితులను వెనక్కు పంపించారని అడిగితే మాత్రం బీజేపీ పెద్దలు పెదవి విప్పరు. గత అయిదేళ్ల నుంచి ఈ అంశంపై బీజేపీ ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

సోమవారం జరిగిన తీవ్రవాద దాడి రెండురోజుల్లో రెండవది. ఈ దాడికి తామే బాధ్యులమని "కశ్మీరీ టైగర్స్" సంస్థ బాహాటంగానే ప్రకటించింది. ఈ సంస్థకు పాకిస్థాన్‌లోని జైష్-ఎ-మహమ్మద్‌తో అనుబంధం ఉందట. జమ్మూ-కశ్మీర్‌లో తీవ్రవాదుల ఆటసాగుతోంది కానీ తీవ్రవాద వ్యతిరేక చర్యల ప్రభావం మాత్రం కనిపించడంలేదు. ఆ ప్రాంతంలో తీవ్రవాదానికి 370వ అధికరణమే కారణం అయి ఉంటే గత అయిదేళ్ల కాలంలో తీవ్రవాదుల ఆగడాలు ఆగిపోయి ఉండాలి. బీజేపీ ప్రభుత్వం సాధించిందల్లా జమ్మూ-కశ్మీర్ ప్రజలకు ఉన్న ప్రత్యేక సదుపాయాన్ని తొలగించడమే. ప్రజలకు రక్షణ కల్పించిన జాడలేలేవు. దీర్ఘకాలం నుంచి సంఘ్ పరివార్ ఎజెండాలో ఉన్న 370వ రద్దు లక్ష్యాన్ని మాత్రం మోదీ ప్రభుత్వం సాధించగలిగింది. జమ్మూ-కశ్మీర్‌కు త్వరలో రాష్ట్ర ప్రతిపత్తి పునరుద్ధరిస్తామని 370వ అధికరణాన్ని రద్దు చేసినప్పుడు ఇచ్చిన హామీఊసే మోదీ సర్కారు ఎత్తడం లేదు. 370వ అధికరణం రద్దుకు ముందు ఆ రాష్ట్ర శాసనసభను రద్దు చేశారు. అప్పటినుంచి ఇటీవల సార్వత్రిక ఎన్నికలు జరిగేదాకా ఆ ప్రాంత ప్రజలకు తమ అభిప్రాయం వ్యక్తంచేసే అవకాశమే రాలేదు. మొన్నటి ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకున్న వారి సంఖ్య పెరిగిందని, అదీ తమ ఘనతేనని బీజేపీ బాకాలూదుతోంది. కానీ లేక లేక జరిగిన ఎన్నికలలో తమ అభిప్రాయం వ్యక్తం చేయడానికి ప్రజలు ఉత్సాహం కనబరిచారన్నదే వాస్తవం. జమ్మూ-కశ్మీర్‌లో కల్లోల పరిస్థితిని అదుపు చేయడంలో మోదీ సర్కారు ఘోరంగా విఫలమైంది. మణిపూర్‌లో సంవత్సరకాలం నుంచి అంతర్యుద్ధ పరిస్థితులు నెలకొన్నాయి. కనీసం 200 ప్రాణాలు బలైనాయి. కానీ మోదీ తగుదునమ్మా అని రష్యా అధినేత పుతిన్‌కు శాంతిమంత్రం ఉపదేశించడానికి రెండు రోజులపాటు రష్యాలో గడిపివచ్చారు. ఇంకా విచిత్రమైంది ఏమిటంటే ఉక్రెయిన్ మీద యుద్ధం ఆపాలని పుతిన్‌కు నచ్చచెప్పాలని అమెరికా మోదీని పురమాయించిందట. ఉక్రెయిన్‌లో చిక్కుకున్న భారతీయులను వెనక్కు పిలిపించడానికి మోదీ యుద్ధం ఆపించారట. అంతటి శక్తిమంతుడే అయితే పుతిన్‌కు నచ్చచెప్పి మొత్తానికే యుద్ధం ఆపించవచ్చు కదా! అంటే ఏకఛత్రాధిపత్యంలో మోదీ ఇంకా పుతిన్ స్థాయికి ఎదగలేదనుకోవాలి. అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, జమ్మూ-కశ్మీర్ లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సక్సేనా, జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ విరామం లేకుండా ప్రతీకారం తీర్చుకుంటామని శపథాలు చేస్తూనే ఉంటారు. జమ్మూ-కశ్మీర్ విషయంలో మన గూఢచార వ్యవస్థ వైఫల్యం కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. అజిత్ దోవల్ ఎంత ఘనత వహించిన భద్రతా నిపుణుడో రుజువు చేయడానికి అనేక కట్టుకథలల్లారు. అజిత్ డోవల్ రహస్యంగా లాహోర్‌లో పర్యటించారట. కశ్మీర్ లో అసలు మోదీ మాట వినేవారు ఎవరైనా ఉన్నారా అనేదే సమాధానం లేని ప్రశ్న. మన సైనికులంటే తీవ్రవాదులు ఏ మాత్రం భయపడడంలేదు. పైగా దాడులకు బరితెగిస్తున్నారు. ఒక్కో తీవ్రవాద దాడి మన వైఫల్యానికి నిదర్శనం. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో శిక్షణ పొందుతున్న తీవ్రవాదులు రాను రాను రాటుదేలుతున్నారని మాత్రం వారి రోజువారీ కార్యకలాపాలే నిరూపిస్తున్నాయి. గూఢచర్యంలో మన "రా" కన్నా ఎప్పుడూ ఐ.ఎస్.ఐ.దే పై చేయి అవుతోంది. అందుకే తీవ్రవాదులు దూసుకు రాగలుగుతున్నారు.

రాటుదేలిన రాహుల్ - ఊతకర్రల మోదీ

యండి. ఉస్మాన్ ఖాన్

కొన్నాళ్ళముందు వరకు, నరేంద్ర మోదీ ముందు రాహుల్ గాంధీ నిలబడలేడు. అన్న వ్యాఖ్యలు తరచుగా వినిపించాయి. రాహుల్ పప్పు పప్పు అని ప్రత్యర్థులు తీవ్రంగా విమర్శించేవారు. కాని ప్రస్తుతం రాహుల్ గాంధీ బాగా పరిణితి చెందారు. పప్పుకాదు నిప్పు అని నిరూపించుకున్నారు. భారత్ జోడో యాత్రతో అంతులేని ప్రజాభిమానాన్ని కూడగట్టుకున్నారు. ప్రజలతో మమేకమవ్వడం, వారి సమస్యలు వినడం, ఎటువంటి భేషజాలు లేకుండా వారిలో ఒకడిగా కలిసిపోవడం ఆయన స్థాయిని మరింతగా ఇనుమడింపజేసింది. అనవసర విషయాలజోలికి పోకుండా, సమస్యలపైనే మాట్లాడడం, పరిష్కారాలు వెదకడం, దేశం, దేశ భవిష్యత్తు, యువకులు, మహిళల సమస్యలపై స్పందించడం, ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవలసిన అవసరాన్ని విడమరచి చెప్పడం తదితర విషయాలు ప్రజలను ఆలోచింపజేశాయి. అదే సమయంలో ప్రధానమంత్రి పదవివంటి ఉన్నతస్థాయిలో ఉన్న నరేంద్ర మోదీ, ప్రధాని స్థాయిని దిగజార్చి నోరుతెరిస్తే పచ్చి అబద్ధాలు పలకడం, కేవలం అధికారంకోసం కులమతాలమధ్య విద్వేషాలు రెచ్చగొట్టడం ప్రజలు గమనించారు. కేవలం ఎన్నికల్లో గెలవడం కోసం, అధికారాన్ని కాపాడుకోవడంకోసం మోదీ, షాలు సహా, భాజపా నేతలంతా ఎంతటి నీచానికైనా దిగజారడం ప్రజలు జీర్ణించుకోలేక పోయారు. అందుకే కోటి ఆశలు పెట్టుకొని ముహూర్తానికి ముందే ఆదరా బాదరాగా ఆరంభించిన అయోధ్య మందిరం కూడా మోదీని కాపాడలేకపోయింది. అయోధ్యలోనే బీజేపీ అభ్యర్థి చిత్తుచిత్తుగా ఘోరంగా ఓడిపోవడమే దీనికి నిదర్శనం. అంతేకాదు రామమందిరం కొలువై ఉన్న ఉత్తరప్రదేశ్‌లో సైతం బీజేపీ చతికిలపడి, చావుతప్పి కన్నులొట్టపోయింది. 'అబ్ కే బార్ చార్ సౌ పార్' అన్న మోదీ అహంకార పూరిత ప్రగల్భాలకు ప్రజలు సరిగానే స్పందించారు. గతంలో మూడొందలు పైచిలుకు స్థానాలు కట్టబెట్టి సొంతకాళ్ళపై నిలబడేలా ఆదుకున్న ప్రజలు ఈసారి బీహార్, ఆంధ్రా అనే రెండు ఊతకర్రల సాయంతో మోదీని నిలబెట్టారు. ఈ నేపథ్యంలో 18వ లోక్‌సభ మొదటి సమావేశంలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ చేసిన ప్రసంగం పెద్ద దుమారమే రేపింది. రాహుల్ గాంధీ ప్రసంగించడానికి లేచి నిలబడిన వెంటనే, బీజేపీ సభ్యులు ఒక్కసారిగా మూకుమ్మడిగా భారత్ మాతాకీ జై నినాదాలతో సభలో గందరగోళం సృష్టించారు. అధికారపక్ష సభ్యుల అరుపులకు రాహుల్ 'జై సంవిధాన్' అంటూ హుందాగా సమాధానమిచ్చారు. ఎంతో సమయస్ఫూర్తితో రాహుల్ గాంధీ ఇచ్చిన ఈ సింపుల్ సమాధానానికి మోదీ, షాలు సహా బీజేపీ సభ్యులంతా ఒక్కసారిగా అవాక్కయ్యారు. 'భయపడొద్దు, భయపెట్టొద్దు' అని వివిధ మతాలను ఉటంకిస్తూ అభయ హస్తాన్ని చూపుతూ సాగిన రాహుల్ ప్రసంగం అధికారపక్ష సభ్యులకు చెమటలు పట్టించింది. రాహుల్ తన ప్రసంగంలో నీట్ వంటి పోటీ పరీక్షల్లో పేపర్ లీక్‌లు, అగ్నివీర్ పథకం అమలు, దళితులు, ఆదివాసీలు, ముస్లింలు ఇతర మైనారిటీలపై ద్వేషం, అధిక ధరలు, ఎంఎస్‌పికి చట్టపరమైన హామీ,

మణిపూర్ దుర్ఘటన సహా అనేక ముఖ్య అంశాలు ప్రస్తావించినా అవన్నీ పక్కకుపోయి, రాహుల్ కేవలం హిందూ సమాజాన్ని కించపరిచాడన్న అబద్ధపు అంశం ఒక్కటే పదేపదే ప్రచారంలోకొచ్చింది. నిజానికి రాహుల్ గాంధీ మొత్తం హిందూ సమాజాన్ని కించపరిచి మాట్లాడారా? లేక బీజేపీ,మోదీ,షాల హిందూత్వను మాత్రమే దునుమాడారా? అన్నది లోక్‌సభ సమావేశాలను వీక్షించిన ఎవరికైనా ఇట్టే తెలిసిపోతుంది. కాని ఈ పదేళ్ళకాలంలో ఎన్నడూ లేనివిధంగా ప్రధాని మోదీ రాహుల్ ప్రసంగాన్ని మధ్యలోనే అడ్డుకుంటూ, రాహుల్ గాంధీ యావత్ హిందూ సమాజాన్ని అవమానించి మాట్లాడారంటూ నిండు సభలో రాహుల్ మాటల్ని వక్రీకరించే ప్రయత్నం చేశారు. కాని వెంటనే రాహుల్ గాంధీ అందుకొని, నై నై నై హిందూ సమాజం వేరు, మోదీ ప్రవచిత హిందూత్వ వేరు అంటూ ఘాటుగా, సూటిగా సమాధానమిచ్చారు. బీజేపీ హిందూ సమాజంకాదు, మోదీ హిందూ సమాజం కాదు, ఆరెస్సెస్ హిందూ సమాజంకాదు. మోదీ, బీజేపీ, ఆరెస్సెస్ హిందూ సమాజానికి, హిందూ ధర్మానికి ప్రతినిధులు, గుత్తేదారులు కాదని ఘాటుగా స్పందించారు. తమను తాము హిందువులని చెప్పుకొనే బీజేపీ, ఆరెస్సెస్, మోదీల హిందుత్వ అబద్ధాలు, విద్వేషం, అరాచకం పునాదులపై ఉందని, మిగతా హిందూ ధర్మమంతా సత్యం, సహనం, న్యాయం, ధర్మాలను బోధిస్తుందని వివరించారు. హిందూ ధర్మం హింసను, విద్వేషాన్ని ప్రేరేపించదని స్పష్టం చేశారు. మొత్తానికి రాహుల్ గాంధీ తన ప్రసంగంద్వారా బీజేపీ, మోదీలు తాము మాత్రమే హిందూ సమాజ రక్షకులమని చాటుకుంటున్న అబద్ధపు ప్రచారానికి అడ్డుకట్ట వేయడంలో చాలామేరకు సఫలమయ్యారనే చెప్పవచ్చు.

అదే సమయంలో మోదీని ఎదుర్కొనే మొనగాడు లేడనే బీజేపీ నేతల భ్రమలనూ రాహుల్ తన మొదటి ప్రసంగంలోనే పటాపంచలు చేశారని కూడా భావించవచ్చు. కనుక గతంలో లాగ ఇప్పుడు కూడా లోక్‌సభలో ఇష్టానుసారం ప్రవర్తించడం, నచ్చిన చట్టాలు చేస్తామని బెదిరించడం, నోటికొచ్చినంత మాట్లాడడం బహుశా ఇకముందు కుదరకపోవచ్చు. ప్రతిపక్షమే లేని పదేళ్ళ పాలనను తలచుకుంటూ, పరిమితులతో ప్రభుత్వాన్ని నడపవలసి ఉందని, రాటుదేలిన రాహుల్‌నూ ఎదుర్కోవలసి ఉందన్న పచ్చి యదార్థాన్ని మోదీ సర్కార్ గుర్తించవలసిన అవసరం ఉంది. ఆమేరకు అప్రమత్తంగా ఉండవలసిందే.

కెన్యాను పుట్టి ముంచిన విదేశీ రుణాలు

చలసాని వెంకటరామారావు

తూర్పు ఆఫ్రికాలోని ఒక దేశం కెన్యా. పాక్షిక స్వయం ప్రతిపత్తి గల 47 ఆఫ్రికా దేశాలలో ఇది కూడా ఒకటి. 52.2 మిలియన్ల జనాభా కలిగిన ఈ దేశాన్ని మౌంట్ కెన్యా, కిరణ్య, మౌంటెన్ ఆఫ్ వయిట్‌నెస్ అనే పేర్లుతో కూడా పిలుస్తారు. ఇది తూర్పు ఆఫ్రికాలో ఎత్తయిన నగరం. (1700మీ). ప్రస్తుత కెన్యా మొదటి నివాసులు 'నియోథిక్' వేటగాళ్ల సమూహాలు. ఇక్కడ సుమారు 42 తెగలు ఉన్నాయి. కెన్యాను ఎనిమిది ప్రావిన్సులుగా విభజించారు. కికియు జాతి పెద్దది. రిపబ్లిక్ ఆఫ్ కెన్యా 47 కౌంటీ ప్రభుత్వాలతో, కేంద్ర ప్రభుత్వం పాలన కింద ఉంది. వీరి కరెన్సీ కెన్యా షిల్లింగ్. స్వాహిలి, ఇంగ్లీషు భాషలు మాట్లాడతారు. రాజధాని నైరోబి జనాభా 4 మిలియన్ల మంది. నైరోబి అంటే 'చల్లని నీటి ప్రదేశం' అని అర్థం. ఈ చల్లని నీటి ప్రదేశమే ఇప్పుడు వేడి నీటి కొలనుగా మారి నిప్పులు చిమ్ముతున్నది. కెన్యాలో కాకులు ఎక్కువ. ఆహారాన్ని విపరీతంగా తినివేస్తున్నాయి. ఇతర జంతు జాతుల్ని ఇవి బతకనివ్వటంలేదు. తరచు వాటిపై దాడులు చేస్తున్నాయి. ఇప్పుడు కెన్యా ప్రభుత్వం 10 లక్షల కాకులను చంపివేయాలని నిర్ణయించింది. అవి మన (భారతదేశ) కాకులే మరి. భారతదేశం లానే ఒకప్పుడు కెన్యా బ్రిటీష్ వలస ప్రాంతంగా ఉండేది. అప్పుడు ఉగాండా- కెన్యా రైల్వే లైన్ నిర్మాణం నిమిత్తం భారతదేశం నుంచి కార్మికులను కెన్యా తీసుకువచ్చారు. అలా వచ్చిన వారిలో చాలామంది అక్కడే స్థిరపడిపోయారు. సుమారు 20 వేల మందికి పైగా భారతీయ సంతతి ప్రజలు ఇక్కడ ఉన్నారు. కెన్యా దేశ అధ్యక్షుడు విలియ రుటో తన పాలనలో విదేశీ రుణాలపై ఆధారపడి దేశ ఆర్థిక వ్యవస్థను తీవ్ర రుణగ్రస్తం చేశాడు. చైనా, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐఎంఎఫ్), ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ వంటి సంస్థల నుంచి ఇబ్బడి ముబ్బడిగా అప్పులు చేశాడు. దేశ జి.డి.పి. లో 75 శాతం విదేశీ రుణాల నుంచి సేకరించినదే. ఇప్పుడు మొత్తం కెన్యా విదేశీ అప్పులు 8,600 కోట్ల అమెరికన్ డాలర్లకు చేరుకుంది. ప్రతి సంవత్సరం 400 కోట్ల అమెరికన్ డాలర్లు వివిధ దేశాల, ఆర్థిక సంస్థల అప్పులకు చెల్లించాల్సిన పరిస్థితి వచ్చింది. దేశ ఖజానాలో చిల్లిగవ్వ లేదు. దీనికి తోడు కోవిడ్ ప్రభావం, ఉక్రెయిన్-రష్యా యుద్ధం వలన కెన్యా షిల్లింగ్ పతనమయ్యింది. మొత్తం జి.డి.పి.లో 68 శాతం రుణాలు ఉన్నాయి. రుణాలు మొత్తంలో 75 శాతం చైనా నుంచి ఉన్నాయి. రుణ చెల్లింపుల వాయిదాకు చైనా నిరాకరించింది. ఒక అమెరికన్ డాలరుకు 130 షిల్లింగులు చెల్లించాల్సిన స్థితిలో కెన్యా దివాళా స్థితికి వచ్చింది. ఇప్పుడు విదేశీ రుణాల సమస్యతో పాటు నిత్యవసరాలు, పెట్రోల్, డీజిల్ కొరత కెన్యాను పట్టి పీడిస్తున్నది. ఐఎంఎఫ్, ప్రపంచ బ్యాంకులు సైతం రుణాల చెల్లింపులకు తీవ్రంగా వత్తిడి చేస్తున్నాయి. దిక్కుతోచని స్థితిలో ప్రజలపై పన్నుల భారం వేయక తప్పని స్థితిలోకి కెన్యా వచ్చింది.

కెన్యా పార్లమెంటుకు ముందుకు ప్రజలపై పన్నుల భారం వేస్తు ఒక ఆర్థిక బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా జూన్ 21 నుంచి ఆందోళనలు ప్రారంభమయ్యాయి. జూన్ 25 న పార్లమెంటు బిల్లును ఆమోదించటంతో నిరసనలు పరాకాష్ఠకు చేరాయి. జూన్ 25 మంగళవారం పెద్ద సంఖ్యలో ప్రజలు పార్లమెంటును ముట్టడించి హింసకు, విధ్వంసానికి పాల్పడ్డారు. ఐ.ఎం.ఎఫ్ ప్రేరేపితమైన ఈ ఆర్థిక బిల్లు ఆమోదించటంతో ప్రారంభమైన నిరసనలు తిరుగుబాటు రూపం తీసుకున్నాయి. పోలీస్, సైన్యం జోక్యంతో వీధి పోరాటంగా మారింది. రుటో రక్త పాలనపై ప్రజలు ప్రతీకారేచ్ఛతో తిరుగుబాటు రూపం తీసుకుంది. పాలకవర్గాల నిర్లక్ష్యం, అవినీతి, పెరుగుతున్న ఆహార ఇంధన ధరలు, నిరుద్యోగం వంటి సమస్యలకు తోడు పన్నుల భారం ప్రజలను తిరుగుబాటుకు పురికొల్పింది. అమెరికా, నాటో సామ్రాజ్యవాదుల మద్దతుతో నడుస్తున్న పాలకవర్గ నియంతృత్వంపై ప్రజాగ్రహంగా ఈ తిరుగుబాటు జరిగింది. 60 ఏళ్ల స్వాతంత్ర్యం క్రమంలో ఈ రకమైన తిరుగుబాటు జరగటం ఇదే మొదటిసారి. పార్లమెంటు భవనంపై ప్రజల సాముదాయక తిరుగుబాటు, పార్లమెంటు తలుపులు తగలబెట్టటం, అద్దాలు, కుర్చీలు, ఇతర పరికరాలు ప్రజలు ధ్వంసం చేశారు. మొత్తం 47 కౌంటీలకు గాను 37 కౌంటీలలో లక్షల మంది ప్రజలు నిరసనలో పాల్గొన్నారు. యువతరం ప్రధాన పాత్ర వహించింది. రక్షణ దళాలను మోహరించినా అల్లర్లు ఆగలేదు. అల్లర్లను ఉక్కుపాదంతో అణచివేస్తామని రుటో ప్రకటించారు. 'అగ్నికి ఆజ్యం తోడైనట్లు' ప్రజలు రెచ్చిపోయారు. అనేక వాహనాలు అగ్నికి ఆహుతి అయ్యాయి. ఆస్తులు ధ్వంసం చేశారు. ప్రభుత్వ భవనాలు తగల బెట్టారు. దేశమంతా ప్రజలు ఆగ్రహంతో రోడ్లపైకి వచ్చారు. గత్యంతరం లేని స్థితిలో పోలీసులు, సైన్యం విచక్షణారహితంగా కాల్పులు జరిపారు. పదుల సంఖ్యలో ప్రజలు చని పోయారు. వందలాది మంది గాయపడ్డారు. వీధుల్లో మృతదేహాలు చెల్లా చెదురుగా పడిపోయాయి. టియర్ గ్యాస్, వాటర్ క్యానన్‌ల ప్రయోగం జరిగింది. ఒక రకమైన యుద్ధ వాతావరణం అలముకుంది. టియర్ గ్యాస్ పొగలు, మంటలు, వాహనాల, భవనాల దహనంతో, బాష్పవాయు ప్రయోగాలతో రాజధాని నగరం నైరోబి అట్టుడికిపోయింది. చివరకు దేశాధ్యక్షుని ప్రైవేటు జెట్ విమానం కూడా తగలబడిపోయింది. ప్రజల రాళ్ల దాడిలో పోలీసులు కూడా పెద్ద సంఖ్యలో గాయపడ్డారు. జూన్ 21 నుంచి 27 వరకు దేశం అల్లకల్లోలంగా మారిపోయింది. దీనితో దేశ అధ్యక్షులు విలియం రుటో బ్లడీ మంగళవారం (25 వ తేది) ఆర్థిక బిల్లు- 2024 ను ఉపసంహరిస్తామని, బిల్లుపై తాను సంతకం చేయనని ప్రకటించారు. దేశ యువతరం సమస్యలపై చర్చించటానికి అధ్యక్షుడు అంగీకరించాడు.

కెన్యా ప్రభుత్వం తన ఆదాయం పెంచుకునేందుకు వివిధ వస్తువులు,సేవలపైన పన్నులు విధించింది. ప్యాక్‌డ్ గూడ్స్, ప్లాస్టిక్, టైర్లు, కంప్యూటర్లు, మొబైల్స్ మీద పన్నులు ప్రతిపాదించారు. బ్యాంకు నగదు లావాదేవీలు, డిజిటల్ చెల్లింపుల పైన వడ్డించారు. శానిటరీ టవల్స్, మోటారు వాహనాలు, ఉద్యోగుల వేతనాలపై పన్నులు విధించారు. అమ్మకం పన్ను, వ్యాట్ టాక్స్ వంటి పన్నులు 16 శాతం వరకు విధించారు. ప్రభుత్వ గృహ నిర్మాణం నిమిత్తం 1.5 శాతం హౌసింగ్ లెవీ విధించింది. అధిక ఆరోగ్య బీమా పన్ను, నెలవారీ ఆదాయంపై పన్ను విధించింది. 200 కోట్ల డాలర్లు సమీకరణ కోసం ఆర్థిక బిల్లులో 2.7 బిలియన్ డాలర్ల పన్నులను పెంచారు. దీనికి తోడు నిత్యావసర వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ఐఎంఎఫ్ షరతులతో కొత్త పన్నులు విధించారు. ప్రభుత్వ ఆర్థిక విధానాల దుష్పరిణామంతో ద్రవ్యోల్బణం 12.2 శాతానికి చేరుకుంది. ప్రజల నిజ ఆదాయం తరిగిపోయి, నిత్యవసరాల ధరలు పెరిగి ప్రజల కొనుగోలు శక్తి క్షీణించటం వంటి దుర్లభ స్థితిలో "గోరుచుట్టుపై రోకటిపోటు" లా నూతన పన్నుల భారం వేయటంతో ప్రజల ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దాని పరాకాష్ఠగా జూన్ 25 న ప్రజల సామూహిక తిరుగుబాటు జరిగింది. సోషల్ మీడియా ప్రభావంతో యువత ఈ ఉద్యమంలో వేగంగా పాల్గొన్నారు. రాజధాని నైరోబి నగరం చిగురుటాకులా వణికిపోయింది. 1969 కిసుము మారణకాండ టోమో కెన్యాట్టా పర్యటన సందర్భంగా జరిగిన కాల్పులలో డజన్ల మంది మరణించారు. దేశ చరిత్రలో ఆ తర్వాత ఇదే పెద్ద దుర్ఘటన. 17 గంటల్లోనే దేశం కల్లోల భరితంగా మారి పోయింది. నైరోబి శివార్లలోని గితురాయ్ ప్రాంతంలో జరిగిన కాల్పులలో ప్రజలను రక్తస్నానం చేయించారు. అక్కడ 30 మందికి పైగా మరణించారు. 20 ఏళ్లుగా సెంట్రల్ ఆర్గనైజేషన్ ఆఫ్ ట్రేడ్ యూనియన్ సెక్రటరీ జనరల్‌గా ఉన్న ఫ్రాన్సిస్ అట్వోలి ఆర్థిక బిల్లును అధ్యక్షుడు సస్పెండ్ చేయాలని, ఇతర డిమాండ్ల పరిష్కారానికి ఒక విచారణ కమిషన్ నియమించాలని డిమాండ్ చేశారు. దేశం క్షీణిస్తే అది యావత్ కెన్యా ప్రజలకు నష్టమని ఆయన పేర్కొన్నారు. చెడ్డ ప్రభుత్వ నిర్వాకం వల్ల దేశం అరాచకం అనుభవించాల్సి వస్తున్నదని ఆయన వాపోయాడు. మిలియనీర్ రైలా ఒడింగా ప్రతిపక్షానికి నాయకత్వం వహిస్తున్నారు. ఈయనకు రుటో ఆర్థిక కార్యకలాపాల పట్ల వ్యతిరేకత లేదు. కానీ దేశంలో ప్రజాందోళనలకు తలవంచి ప్రతిస్పంది స్తున్నారు. ప్రభుత్వ వైఖరిని కెన్యా కమ్యూనిస్టు పార్టీ (సిపికె) ఖండించింది. వీధుల్లో అమాయక ప్రజల రక్తం పారించిన అధ్యక్షుడు రుటో క్షమార్హుడు కాదని, రాజీనామా చేయాలని డిమాండ్ చేసింది. విదేశీ ఆర్థిక సంస్థల జోక్యం నిలువరించాలని, ప్రభుత్వం ప్రైవేటీకరణ విధానాలు ఆపాలని వారు కోరారు. పన్నులు రద్దు చేయాలని, ఆర్థిక బిల్లు ఉపసంహరించాలని సి.పి.కె. డిమాండ్ చేసింది. కెన్యా ప్రభుత్వం తక్షణం 200 కోట్ల యూరో బాండ్లు చెల్లించాలి. చైనా అప్పు వాయిదా 120 కోట్ల డాలర్లు చెల్లించాలి. ప్రపంచ బ్యాంకుకు 66 కోట్ల డాలర్లు, ఆఫ్రికన్ డెవలప్‌మెంట్ బ్యాంకుకు 65 కోట్లు డాలర్లు, ఐ.ఎం.ఎఫ్‌కు 11 కోట్ల డాలర్లు చెల్లించాలి. కానీ దేశం దివాళా అంచున ఉంది. ఈ విదేశీ రుణాలు కెన్యా పుట్టి ముంచాయి. ఈ గండం నుంచి కెన్యా ఎలా బయటపడుతుందో భవిష్యత్ తేల్చాలి.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు
సెల్: 9490952093

చరిత్ర సృష్టించిన వామపక్షాలు

సంగిరెడ్డి హనుమంతరెడ్డి

ఫ్రాన్స్ జాతీయ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో న్యూ పాపులర్ ఫ్రంట్ (ఎన్ఎఫ్‌పి) చరిత్ర సృష్టించింది. అతి మితవాద శక్తులను ఎన్ఎఫ్‌పి ఓడించి జయకేతనం ఎగురవేసింది. దాదాపు ఎనిమిది దశాబ్దాల తర్వాత వామపక్షాలు గుర్తింపు పొందాయి. మెరైన్ లీపెన్ నాయకత్వంలో అత్యంత మితవాద పార్టీ అత్యధిక సీట్లతో విజయం సాధిస్తుందని విస్తృత ప్రచారం జరిగింది. ఫలితాలు వెల్లడైన తర్వాత యూరోపియన్ దేశాలన్నీ ఆశ్చర్యచకితులయ్యాయి. ఎన్ఎఫ్‌పి, మధ్యేవాద మాక్రాన్ పార్టీలు కలిసి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడే అవకాశాలున్నాయి. 2024 జూన్ 6-9 తేదీల్లో జరిగిన యూరోపియన్ యూనియన్ (ఇయు) ఎన్నికల్లో ఫ్రాన్స్ నేషనల్ రాలి (ఆర్.ఎన్.) పార్టీకి ఎక్కువ సీట్లు వచ్చాయి. దాని నిలువరింపుకు అధ్యక్షుడు మాక్రాన్ పార్లమెంటును రద్దుచేసి జూన్ 30, జులై 7న రెండు విడతల్లో జరిగేటట్లు జూన్ 9 న మధ్యంతర ఎన్నికలు ప్రకటించాడు. ఫ్రాన్స్, జర్మని, ఇటలీలలో మతవాద పార్టీలు బెదిరిస్తున్నాయి. యూరప్‌లోనేకాక ఇండియా లాంటి దేశాల్లోనూ పాలక పార్టీలు విఫలమయ్యాయి. వామపక్షాలు విడిపోయాయి. వాటి మధ్య ఐక్యత కుదరలేదు. మతవాదులు, వామపక్షాలూ ప్రజావ్యతిరేకులని, ఉగ్రవాదులని అబద్ధాలు తీవ్ర విషప్రచారం చేశారు. ప్రజలు నమ్మారు. 1936 లో వామపక్షాలు ఫాసిజం నుండి తీవ్ర పోటీని ఎదుర్కొన్నాయి. పాపులర్ ఫ్రంట్ కూటమి కట్టి ఆ ఏటి ఎన్నికల్లో గెలిచాయి. జీతంతో సెలవు, వారానికి 40 పనిగంటలు, ఇతర సంస్కరణలను తెచ్చాయి. 2022 ఎన్నికల్లో ఐక్యత కుదరలేదు. మతపాలనా? ఐక్యతా? అన్నదే నేటి ఎంపిక. మాక్రాన్ ఎన్నికలు ప్రకటించగానే సోషలిస్టులు, గ్రీన్ పార్టి, కమ్యూనిస్టులు, తీవ్రవాద వామపక్షం ఫ్రాన్స్ అన్బౌడ్ (ఎల్.ఎఫ్.ఐ.) కొత్త పాపులర్ ఫ్రంట్ (ఎన్.ఎఫ్.పి.) గా ఏర్పడ్డాయి. జీతాల, ప్రజల కొనుగోలు శక్తి పెంపు, 64 నుండి 60కి పదవి విరమణ వయసు, ధరల తగ్గింపు, ఇళ్ల రాయితీలు, శరణార్థుల, పర్యావరణ బాధితుల రక్షణ, పర్యావరణ విధాన ప్రణాళికను ప్రకటించాయి. ఇయు వాణిజ్య సంస్థ మతవాద ఆర్.ఎన్.ను నిరోధించాలని ప్రకటించింది. సోషల్ డెమోక్రాట్లు, పెట్టుబడిదారి వ్యతిరేక పార్టీలు, కార్మిక, పౌర సంఘాలు, ప్రజలు ఫ్రంట్‌కు మద్దతిచ్చాయి. మతవాదుల ఓటమి చారిత్రక అవసరాన్ని ప్రచారం చేశారు.

ఆర్.ఎన్. అతి మతవాద, వలస వ్యతిరేక, స్త్రీ ద్వేష పార్టీ. ఇస్లాం ద్వేషి. సమస్యలన్నిటికీ ముస్లింలు కారణమంటుంది. యువతను ఆకట్టుకుంది. 1972లో

స్థాపించిన దీని పాత పేరు నేషనల్ ఫ్రంట్. ఆర్.ఎన్. నాయకురాలు మారిన్ లి పెన్ పార్టి సహ వ్యవస్థాపకుడు జీన్ మేరీ లి పెన్ కూతురు. జీన్ జాత్యహంకార, యూదు వ్యతిరేక నేరాలను ఎదుర్కొన్నారు. మెతక వైఖరితో మారిన్ 90 ఏళ్ళు పైబడ్డ తండ్రితో 2015 లో ఆర్.ఎన్. సంబంధం తెంచారు. నేను ముస్లిం వ్యతిరేకిని కాను. ఐతే విదేశీయుల వలసలు పెరిగాయి. వారు ఫ్రాన్స్ సంక్షేమాలను పొందుతున్నారు. ఇబ్బందులు కలిగిస్తున్నారు అని మారిన్ అన్నారు. 2002 అధ్యక్ష ఎన్నికల్లో జీన్ 17శాతం వోట్లు తెచ్చుకున్నారు. 2012 అధ్యక్ష ఎన్నికల్లో మారిన్ మూడో స్థానంలో నిలిచారు. 2017 లో 34శాతం, 2022లో 41శాతం ఓట్లు పొందారు. ఈ రెండుసార్లు గెలిచాడు. 2022 నుండి 28 ఏళ్ల జోర్డాన్ బర్డెల్ల ఆర్.ఎన్. నాయకుడు. ఉక్రెయిన్ కిచ్చిన ఆయుధాలను వాపసు తేవాలని, ఉక్రెయిన్‌కు ఫ్రెంచ్ మద్దతుపై పరిమితులు విధించాలని బర్డెల్ల అభిప్రాయం.

577 సీట్ల పార్లమెంటులో ప్రభుత్వ ఏర్పాటుకు 289 సీట్లు కావాలి. ప్రజలు రెండు విడతల్లో పార్లమెంటు సభ్యులను ఎన్నుకుంటారు. 50శాతం పైన ఓట్లు తెచ్చుకున్నవారు మొదటిసారే ఎన్నికవుతారు. 12.5-50శాతం మధ్య ఓట్లు వచ్చినవారికి రెండవ విడత ఎన్నికలు జరుగుతాయి. 30.6.2024 న మొదటి విడత ఎన్నికల్లో మారిన్ గెలిచారు. ఆర్.ఎన్. 33.15శాతం, వామపక్ష కూటమి 28శాతం, మాక్రాన్ శిబిరం 20.76శాతం ఓట్లు సాధించాయి. సంప్రదాయవాద రిపబ్లికన్లు (ఎల్.ఆర్.) ఆర్.ఎన్.కు మద్దతిచ్చారు. 12.5శాతం ఓట్లు వచ్చిన వారు 300 దాటారు. మాక్రాన్, వామపక్ష కూటములు తృతీయ స్థానాల్లో నిలిచిన 200 మందిని పోటీనుంచి విరమించాయి. మాక్రాన్, లిపెన్ కూటములు ఒకవైపు, వామపక్ష కూటమి మరోవైపు నిలిచాయి. ఆర్.ఎన్. గెలుస్తుందని ప్రజలు భయపడ్డారు. దాని నిలువరింపుకు మధ్యేమార్గ వామపక్ష అభ్యర్థులు ఏకమయ్యారు. ఆర్.ఎన్. వ్యతిరేక ఓట్లు చీలకుండా 200 మంది అభ్యర్థులను విరమించారు. నాజి గుర్తు ధరించినవారిని, వివాదాస్పద వ్యాఖ్యా నాలు చేసినవారిని ఆర్.ఎన్. పోటీనుంచి తొలగించింది. మాక్రాన్ మధ్యంతర నిర్ణయానికి, మొదటి విడతలో ఆర్.ఎన్. ఆధిక్యతకు ప్రజలు నిరసన తెలిపారు. రెండవ విడత ఎన్నికలు 7.7.2024 న జరిగాయి. ఇయు, మొదటి విడత ఎన్నికల్లో ఓటేయనివారు, విదేశీ ఫ్రెంచ్ పౌరులు రికార్డు సంఖ్యలో ఆన్ లైన్ లో ఓటేశారు. ప్రజలు మతవాద ప్రమాదాలనే కాక వామపక్ష ఐక్యతను, మైనారిటీల, వలసజీవుల భద్రతను గుర్తించారు. ఒక్క సీటు కూడా ఆర్.ఎన్.కు రానివ్వమన్నారు. ఆర్.ఎన్.కు ఇటలి, స్పెయిన్ మతవాద నాయకులు మద్దతు పలికారు. ఎన్నికల ప్రచారాల్లో బెదిరింపులు, హింస, జాత్యహంకార దురుప యోగాలు జరిగాయి. వామపక్ష, మధ్యేమార్గ అభ్యర్థులు ప్రజాస్వామ్య విలు వలను, రాజ్యాంగ పాలనను రక్షించమని కోరారు. వామపక్ష కూటమి (ఎన్.ఎఫ్.పి.)కి 182, మాక్రాన్ ఎన్సెంబుల్కు 168, ఆర్.ఎన్.కు 143, సంప్రదాయవాద రిపబ్లికన్లకు 46, ఇతరులకు 38 సీట్లు వచ్చాయి. ఎన్.ఎఫ్.పి. అతిపెద్ద కూటమి. రెండు రోజుల్లో నాటొ సమావేశాలు, మూడు వారాల్లో ప్యారిస్ ఒలింపిక్ ఆటలు మొదలు కానున్నాయి. ప్రధాని గాబ్రియల్ అట్టల్ రాజీనామాకు సిద్ధపడ్డాడు కాని ఆటల నిర్వహణలో తన పాత్ర పోషిస్తానన్నాడు. ఎల్.ఎఫ్.ఐ., ఎన్.ఎఫ్.పి.ల నాయకుడు జీన్‌లుక్ మెలెంచొన్ వామపక్ష ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇమ్మని కోరారు. ఎన్.ఎఫ్.పి.లో సోషలిస్టు పార్టి తరఫున పూర్వ అధ్యక్షులు ఫ్రాంకొయిస్ హొలాండే, ఫ్రాంకొయిస్ మిట్టరాండ్ గెలిచారు.మాక్రాన్ కూటమి ఎన్.ఎఫ్.పి.లోని సోషలిస్టులు, గ్రీన్ పార్టీతో కలిసి సంకీర్ణ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రయత్నించవచ్చు. అన్బౌడ్ ఆధీన వామపక్షం, ఆర్.ఎన్.తో సమానంగా అపాయకరమని మాక్రాన్ ప్రచారం చేశాడు. వామపక్షం పదవి విరమణ వయస్సును తగ్గించాలని పట్టుబట్టవచ్చు. 2023లో దీన్ని 62 నుండి 64 ఏళ్ళకు పెంచిన మాక్రాన్ దీనికి ఒప్పుకోరు. మతవాద, వామపక్ష కూటముల్లోని మితవాదులతో మాక్రాన్ మైనారిటీ ప్రభుత్వాన్ని నడుప వచ్చు. ప్రధానిని అధ్యక్షుడు నియమిస్తాడు. దానికి కాలవ్యవధి, మెజారిటీ పక్షం నుండి నియమించాలన్న నియమాలు లేవు. మాక్రాన్ ఈ నియామకాన్ని ఆలస్యం చేయచ్చు.

ప్రధాని మెజారిటీ ఎన్.ఎఫ్.పి. నుండే ఉండాలి. ఎన్.ఎఫ్.పి.నాయకుడు మెలెంకోన్ ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం ఇవ్వాలని కోరారు. అయితే, అధ్యక్షుడు ప్రజాభీష్టాన్ని మన్నించాలి, ఇతర ఏర్పాటు ఆమోదనీయం కాదన్నారు. గ్రీన్‌లు, సోషలిస్టులు దీన్ని సమర్థించారు. ప్రధానిగా మెలెంకోన్‌ను ఆర్.ఎన్. యేతర మితవాదులు వ్యతిరేకించవచ్చు. వామపక్ష భాగస్వామి అయిన పూర్వపత్రికారుడు, చిత్ర నిర్మాత ఫ్రాంకొయిస్ రుఫిన్ కాని, సోషలిస్టు పార్టీకి చెందిన బోరిస్ వలౌడ్ కాని, గ్రీన్ పార్టి నాయకురాలు మారిన్ తొండెలీర్ కాని, నిష్పక్షవాద లారెంట్ బర్గర్ కాని ప్రత్యామ్నాయ ప్రధాని అభ్యర్థులు కావచ్చు. రాజ్యాంగ అధికరణ 49.3 ప్రకారం ప్రతిష్టంభన నివారణకు ప్రధాని ఏక పక్షంగా చట్టాలు చేయచ్చు. దీన్ని అంగీకరించని పక్షం 24 గంటల్లో అవిశ్వాస తీర్మానంపెట్టి సాధారణ ఆధిక్యతతో గెలవాలి. 7వ తేదీ ఎన్నికల ఫలితాలను అవిశ్వాస ఓటుగా పరిగణించి, రాజీనామాచేసి మరల ఎన్నికల ప్రతిపాదనకు మాక్రాన్ వడిగట్టవచ్చు. ఆర్.ఎన్.నిరోధానికి ఎన్.ఎఫ్.పి.కి మాక్రాన్ ఉధృత సహకారం మరువరానిది. మాక్రాన్‌తో కలువనన్న అతివాద ధోరణిని మెలెంకోన్ వదలాలి. సమన్వయంకోసం ఆర్.ఎన్. మతోన్మాద కుట్రలకు అవకాశమివ్వని యుక్తిని మాక్రాన్ ప్రదర్శించాలి.

సెల్: 94490204545

కర్నాటకలో రైతులకు గడ్డుకాలం

15 నెలల్లో 1,182 మంది ఆత్మహత్య

- కరవు, అప్పుల బాధ తాళలేక తనువుచాలిస్తున్న అన్నదాతలు
- ఆత్మహత్యలే లేవని డిప్యూటీ సీఎం వ్యాఖ్య
- వాస్తవాలను వెల్లడించిన రెవెన్యూ శాఖ నివేదిక

విశాలాంధ్ర-బెంగళూరు: కాంగ్రెస్ పాలిత కర్నాటకలో రైతుల ఆత్మహత్యలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. తీవ్ర కరవు, అప్పుల భారం, పంట నష్టం వంటి కారణాల వల్ల రైతన్నలు ప్రాణాలు తీసుకుంటున్నారు. వ్యవసాయం చేయలేక, అప్పులు తీర్చలేక అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. ప్రభుత్వం మాత్రం ఆత్మహత్యలను తేలిగ్గా తీసుకుంటున్నదని ప్రతిపక్షాలు విమర్శలు గుప్పిస్తున్నాయి. అన్నదాతల ఆత్మహత్యలపై కాంగ్రెస్ మంత్రులు ఒక్కొక్కరు ఒక్కో తీరున మాట్లాడుతున్నారని ఆరోపిస్తున్నాయి. నష్ట పరిహారం కోసమే ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఓ మంత్రి అంటే, అసలు రైతు ఆత్మహత్యలే జరగడం లేదని మరో మంత్రి వ్యాఖ్యానించడంపై దుమ్మెత్తిపోస్తున్నాయి. అసలు విషయం తాజాగా రెవెన్యూ శాఖకు చెందిన ఒక దస్త్రంలో బయటకు వచ్చింది. గత 15 నెలల కాలంలో రాష్ట్రంలో 1,182 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారని ఈ నివేదిక స్పష్టం చేస్తోంది. రాష్ట్రంలో ఎక్కువగా బెళగావి జిల్లాలో 122 మంది, హావేరిలో 120 మంది, ధార్వాడ్‌లో 101 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. చిక్‌మగళూరులో 89 మంది, కలబుర్గిలో 69 మంది, యాదగిరిలో 68 మంది రైతులు బలవంతంగా తనువు చాలించారు. 27 జిల్లాలతో కూడిన కర్నాటకలో కేవలం ఆరు జిల్లాల్లో మాత్రమే 10 మంది లోపు రైతులు ఆత్మహత్య చేసుకున్నారు. మిగతా 21 జిల్లాల్లో 30 మందికి పైగా రైతన్నలు ఆత్మహత్యలకు పాల్పడ్డారు.

పరిహారం పెంచాకే ఆత్మహత్యలు పెరిగాయి: మంత్రి పాటిల్

రైతుల ఆత్మహత్యల అంశాన్ని రైతు సంఘాలు, విపక్ష పార్టీలు లేవనెత్తుతున్నప్పటికీ ప్రభుత్వం మాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆత్మహత్యలపై మంత్రుల స్పందన తీవ్ర విమర్శలకు తావిస్తున్నది. గత సెప్టెంబరులో చెరుకు అభివృద్ధి, వ్యవసాయ ఉత్పత్తుల మార్కెట్ కమిటీల మంత్రి శివానంద్ పాటిల్ రైతుల ఆత్మహత్యలపై మాట్లాడుతూ ప్రభుత్వం ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు ఇచ్చే నష్టపరిహారాన్ని పెంచిన తర్వాత రైతుల ఆత్మహత్యలు పెరిగాయని పేర్కొనడం వివాదాస్పదమైంది. ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారు. 'ఆత్మహత్యలు ఎక్కడ జరుగుతున్నాయో చెప్పండి. సొంత కారణాల వల్ల ఆత్మహత్యలు చేసుకున్న వారిని రైతులు అంటామా' అంటూ ఆయన వ్యాఖ్యానించడంపై విమర్శలు వచ్చాయి. ఇప్పుడు రెవెన్యూ శాఖ లెక్కల ప్రకారమే 15 నెలల్లో 1,182 మంది రైతులు ఆత్మహత్య చేసుకొన్నారని తేలడంతో రాష్ట్రంలో రైతుల దయనీయ స్థితి స్పష్టమవుతున్నదని విపక్షాలు పేర్కొంటున్నాయి.

ప్రముఖ గాయని ఉషా ఉతప్ భర్త మృతి

కోల్‌కత: ప్రముఖ గాయని ఉషా ఉతప్ భర్త జానీ చాకో ఉతప్ (78) ప్రాణాలు కోల్పోయారు. కోల్‌కతాలోని నివాసంలో సోమవారం రాత్రి గుండెపోటుతో తుది శ్వాస విడిచారు. వివరాల్లోకి వెళితే.. రాత్రి సమయంలో టీవీ చూస్తున్న జానీ చాకో ఉతప్ ఛాతిలో నొప్పిరావడంతో కుటుంబ సభ్యులు ఆయన్ని హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే ఆయన మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆయన మరణంతో ఉషా ఉతప్ ఇంట విషాద ఛాయలు అలముకున్నాయి. జానీ చాకో అంత్యక్రియలు మంగళవారం నిర్వహించనున్నట్లు తెలిసింది. ఉషా ఉతప్ దంపతులకు కుమారుడు సన్నీ, కుమార్తె అంజలి ఉన్నారు. ఉషా ఉతప్ తన కెరీర్‌లో బెంగాలీ, హిందీ, పంజాబీ, అస్సామీ, ఒరియా, గుజరాతీ, మరాఠీ, మలయాళం, కన్నడ, తమిళం, తెలుగుతో సహా మొత్తం 16 భాషల్లో పాటలు పాడి కోట్లాది మంది అభిమానులను సంపాదించుకున్నారు. సంగీత ప్రపంచంలో ఆమె చేసిన సేవలకు గానూ కేంద్ర ప్రభుత్వం 2011లో భారత నాల్గవ అత్యున్నత పౌర పురస్కారం పద్మశ్రీతో, 2024లో మూడో అత్యున్నత పౌర పురస్కారమైన పద్మభూషణ్‌తో సత్కరించింది.

బీఎస్పీ నేత కుటుంబానికి స్టాలిన్ పరామర్శ

చెన్నై: తమిళనాడులో హత్యకు గురైన బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు కే ఆర్మ్‌స్ట్రాంగ్ కుటుంబాన్ని ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పరామర్శించారు. ఆర్మ్‌స్ట్రాంగ్ నివాసానికి మంగళవారం ఉదయం వెళ్లిన స్టాలిన్.. ఆయన చిత్రపటం వద్ద పూలు ఉంచి అంజలి ఘటించారు. అనంతరం కుటుంబ సభ్యుల్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఆర్మ్‌స్ట్రాంగ్ శుక్రవారం రాత్రి పెరంబూరులోని తన ఇంటికి సమీపంలో దారుణ హత్యకు గురైన విషయం తెలిసిందే. గుర్తుతెలియని వ్యక్తులు బైకులపై వచ్చి ఆయనను హత్య చేశారు. ఆదివారం బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి చెన్నైకి వచ్చి ఆర్మ్‌స్ట్రాంగ్ పార్థివదేహానికి నివాళులు అర్పించారు. ఆర్మ్ స్ట్రాంగ్ హత్య కేసును తమిళనాడు ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుని సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. ఆర్మ్ స్ట్రాంగ్ హత్యతో దళిత నేతలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. ఘటనకు బాధ్యుడిగా చెన్నై సీపీ సందీప్ రాయ్ రాథోడ్‌ను బదిలీ చేసింది. పోలీస్ ట్రెయినింగ్ కాలేజీ డీజీపీగా ఆయనను నియమించింది. అడిషనల్ సీపీగా ఉన్న ఏ అరుణ్‌ను చెన్నై నగర కొత్త కమిషనర్‌గా నియమించింది.

కన్యాకుమారిలో సముద్రం వెనక్కి...

భయాందోళనలో స్థానికులు... పర్యాటకుల అవస్థలు

చెన్నై: రాష్ట్రంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో ఒకటైన కన్యాకుమారి సముద్ర తీరంలో నీరు ఉన్నట్టుండి వెనక్కి వెళ్లింది. దీంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. మంగళవారం ఉదయం కుమరి జిల్లాలోని వివేకానంద రాక్, తిరువళ్ళూరు విగ్రహాల వద్దకు పర్యాటకులు చేరుకున్నారు. వీరంతా బోటుల్లో ప్రయాణం చేసేందుకు టికెట్ల కొనుగోలు చేసి నిల్చున్నారు. ఆ సమయంలో ఉన్నట్టుండి సముద్రం నీరు వెనక్కి వెళ్లింది. దీంతో పడవ ప్రయాణాన్ని తాత్కాలికంగా నిలిపివేశారు. దాదాపు రెండు గంటల తర్వాత పడవ ప్రయాణాన్ని మళ్లీ ప్రారంభించడంతో పర్యాటకులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం కూడా ఇదే పరిస్థితి నెలకొంది. గత కొన్ని రోజులుగా ఇలా ఉన్నట్టుండి వెనక్కి వెళ్లడం, కొన్ని గంటల తర్వాత మళ్లీ పూర్వస్థితికి రావడం జరుగుతుంది. ఇలా జరగడానికి గల కారణాలు మాత్రం తెలియడం లేదు. మరికొన్ని సందర్భాల్లో సముద్రం అలలు నాలుగు నుంచి ఐదు అడుగుల వరకు ఎగిసిపడుతుంటాయి. అలాంటి సమయాల్లో కూడా పడవ ప్రయాణాన్ని పర్యాటక శాఖ అధికారులు నిలిపివేస్తున్నారు.

ఆవాస్ యోజన డబ్బు చేతికి.. భర్తలను వదిలేసి...

లక్నో: పేదల పక్కాఇళ్ల నిర్మాణానికి 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన' కింద కేంద్రం ఆర్థికసాయం అందిస్తోంది. ఈ పథకం ద్వారా వివిధ రాష్ట్రాల్లో వేల మంది లబ్ధి పొందుతున్నప్పటికీ... కొన్నిచోట్ల అది దుర్వినియోగం అవుతున్నట్లు వెల్లడైంది. ఈ పథకం కింద మొదటివిడత సాయం పొందిన పలువురు వివాహితలు... తమ భర్తలను వదిలేసి నచ్చినవారితో పారిపోయినట్లు తేలింది. ఉత్తర్‌ప్రదేశ్‌లో ఈ వ్యవహారం వెలుగుచూసింది. యూపీలోని మహరాజ్‌గంజ్ జిల్లాలో ఇటీవల 2,350 మందికి ఆవాస్ యోజన నగదు విడుదలైంది. తొలివిడతగా రూ.40 వేలు చొప్పున లబ్ధిదారుల ఖాతాల్లో జమైంది. ఇదే సమయంలో తమ భార్యలు ప్రేమికులతో/నచ్చిన వారితో వెళ్లిపోయారంటూ అనేకమంది బాధితులు పోలీసులను ఆశ్రయించారు.

ఇలా జిల్లాలో 11 కేసులు నమోదైనట్లు సమాచారం. టుత్తిబరీ, షీత్లాపుర్, చాతియా, రామ్‌నగర్, బకుల్ డీహా, ఖాస్రా, కిషన్‌పుర్, మెథౌలీలో ఈ కేసులు వెలుగు చూశాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు ఈ పథకం కింద రెండోవిడత నగదును నిలిపివేయాలని నిర్ణయించినట్లు స్థానిక మీడియా పేర్కొంది. పీఎంఏవై పథకం కింద పక్కా ఇళ్ల నిర్మాణం కోసం పేద, మధ్యతరగతి కుటుంబాలకు రాయితీ రూపంలో గరిష్ఠంగా రూ.2.5 లక్షల వరకు ఆర్థికసాయాన్ని కేంద్ర ప్రభుత్వం అందిస్తుంది. అయితే, ఇందుకు మహిళలే కుటుంబ యజమాని/సహ యజమానిగా ఉండాలనే నిబంధన ఉంది. ఈ క్రమంలోనే ఈ పథకం ద్వారా ఆర్థికసాయం అందిన వెంటనే చాలామంది వివాహితలు తమ భర్తలను విడిచిపెట్టి వెళ్లిపోవడం స్థానికంగా తీవ్ర చర్చనీయాంశమైంది.

నర్సుపై సహోద్యోగి అత్యాచారం...

రెండేళ్లుగా లైంగిక వేధింపులు

భోపాల్: మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దారుణం జరిగింది. 28 ఏళ్ల నర్సుపై సహోద్యోగి గత రెండేళ్లుగా అత్యాచారానికి పాల్పడుతున్నాడు. గ్వాలియర్ ఆస్పత్రిలో పనిచేస్తున్న బాధిత మహిళ దుస్తులు మార్చుకునే గదిలో నిందితుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. రెండేళ్లుగా బాధితురాలిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిసింది. ఆమెకు సంబంధించిన వీడియోలను రికార్డ్ చేసి, వాటిని లీక్ చేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తూ రాక్షసకాండను కొనసాగిస్తున్నాడు.

నిత్యం వేధింపులతో విసిగిపోయిన బాధితురాలి మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఈ సంఘటన గ్వాలియర్‌లోని శివపురి లింక్ రోడ్‌లో ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో చోటు చేసుకుంది. తనతో కలిసి పనిచేసే ఆకాష్ సింగ్ తోమర్ తనపై లైంగిక దాడికి పాల్పడినట్లు బాధిత మహిళ ఫిర్యాదులో పేర్కొంది. నిందితుడు 2022, ఏప్రిల్‌లో ఆమెపై అత్యాచారం చేశాడు. ఈ వీడియోలను ఉపయోగించి రెండేళ్ల కాలంగా ఆమెను హింసిన్నాడు. ఈ వేధింపులు భరించలేక బాధిత నర్సు తన భర్త వద్దకు వెళ్లి పరిస్థితిని చెప్పింది. ఆమె ఫిర్యాదు మేరకు ఝాన్సీ రోడ్ పోలీసులు తోమర్‌పై అత్యాచారం, బెదిరింపుల కింద కేసు నమోదు చేశారు. కేసు నమోదైన తర్వాత తోమర్ ఆస్పత్రి నుంచి అదృశ్యమయ్యాడు. అతడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు చెప్పారు.

14 ఉత్పత్తుల అమ్మకాలు నిలిపివేశాం

సుప్రీంకోర్టులో పతంజలి సంస్థ అఫిడవిట్

న్యూఢిల్లీ: తయారీ లైసెన్స్ రద్దు అయిన 14 రకాల ఉత్పత్తుల విక్రయాలను నిలిపివేశామని పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసింది. ఆ ఉత్పత్తులను వెనక్కి తీసుకోవాలని దేశవ్యాప్తంగా ఉన్న తమ ఫ్రాంచైజీ స్టోర్లకు సూచించామని తెలిపింది. అలాగే వాటికి సంబంధించిన ప్రకటనలను ఉపసంహరించుకోవాలని మీడియా సంస్థలకు సమాచారం ఇచ్చినట్లు వెల్లడించింది. తప్పుదోవ పట్టించే ప్రకటనల కేసులో పతంజలి ఆయుర్వేద సంస్థ సుప్రీంకోర్టు విచారణను ఎదుర్కొంటోంది. దానిలోభాగంగా తప్పుదోవ పట్టించేలా వాణిజ్య ప్రకటనలు ఇచ్చారని నిర్ధారణ అయిన నేపథ్యంలో పతంజలిపై ఉత్తరాఖండ్ ప్రభుత్వం చర్యలు తీసుకున్న విషయం తెలిసిందే. ఈ సంస్థకు చెందిన 14 రకాల ఉత్పత్తులు, అనుబంధ విభాగం దివ్య ఫార్మసీ ఉత్పత్తుల తయారీ లైసెన్సును రద్దు చేసింది. ఈ క్రమంలోనే ఆయుర్వేద సంస్థ నుంచి స్పందన వచ్చింది.

అటల్ పింఛన్ రెట్టింపు చేసే యోచనలో కేంద్రం!

న్యూఢిల్లీ: ఈ నెల 23న కేంద్రప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ ప్రవేశపెట్టనుంది. ఈ బడ్జెట్‌లో వివిధ వర్గాలపై వరాలు కురిపించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. అందులో భాగంగా అటల్ పెన్షన్ యోజన పథకాన్ని మార్పులు చేపట్టే అవకాశం ఉంది. ఈ పథకం కింద అందించే పింఛన్ మొత్తాన్ని పెంచే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోంది. గ్యారెంటీ పెన్షన్ మొత్తాన్ని రూ.5 వేలు నుంచి రూ.10 వేలకు పెంచాలని చూస్తోంది. అటల్ పెన్షన్ యోజనను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దడంతో పాటు గ్యారెంటీగా ఇచ్చే మొత్తాన్ని పెంచేందుకు ఉన్న అవకాశాలను ప్రభుత్వం పరిశీలిస్తోందని సంబంధిత వర్గాలు తెలిపినట్లు వార్త కథనాలు వెలువడుతున్నాయి. ఎలాంటి పింఛను పథకాలకు నోచుకోని వారికోసం అటల్ పెన్షన్ యోజన పథకాన్ని 2015 బడ్జెట్‌లో ప్రకటించారు. నెలకు రూ.1000-5000 వరకు పెన్షన్ అందుతుంది. 18 నుంచి 40 సంవత్సరాల మధ్య వయసున్న వ్యక్తులు ఈ పథకానికి అర్హులు. అందుకు అనుగుణంగా నెలనెలా చెల్లింపులు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఈ పథకంలో 6.62 కోట్ల మంది చేరారు. ఒక్క 2023-24 ఆర్థిక సంవత్సరంలోనే 1.22 కోట్ల మంది ఈ పథకంలో చేరారు. పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ దీన్ని నిర్వహిస్తుంది. జులై 23న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టే బడ్జెట్‌లో ఆ మేరకు ప్రకటన వెలువడనున్నట్లు సమాచారం.

హాత్రస్ తొక్కిసలాటపై 12న సుప్రీంలో విచారణ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లోని హాత్రస్‌లో జరిగిన సత్సంగ్ కార్యక్రమంలో తొక్కిసలాట జరిగి 121 మంది ప్రాణాలను కొల్పోయిన సంగతి విదితమే. కాగా ఈ విషాదంపై ఈ నెల 12వ తేదీన సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. తొక్కిసలాట దుర్ఘటనపై రిటైర్డ్ సుప్రీంకోర్టు న్యాయమూర్తి పర్యవేక్షణలో ఐదుగురు సభ్యుల నిపుణుల కమిటీతో విచారణ జరిపించాలని డిమాండ్ చేస్తూ సుప్రీంకోర్టు న్యాయవాది విశాల్ తివారీ పిటిషన్ దాఖలు చేశారు. అలాగే ఈ ఘటనపై యూపీ ప్రభుత్వం స్టేటస్ రిపోర్టును సమర్పించాలని... బాధ్యులుగా తేలిన అధికారులతో సహా మిగతా నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పిటిషనర్ డిమాండ్ చేశారు. ఇందుకు అవసరమైన మార్గదర్శకాలను రూపొందించాలని సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. కాగా ఈ పిటిషన్‌ను జాబితాలో చేర్చాలని భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ ఆదేశించారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం విచారిస్తామని పేర్కొన్నారు.

శభాష్ డ్రైవర్

బస్సులో మంటలు... ప్రయాణికులు సురక్షితం

బెంగుళూరు: తాము ఏదైనా ప్రమాదంలో ఉన్నామని తెలిస్తేచాలు... వెంటనే ప్రాణాలు కాపాడుకోవడానికి చాలామంది ప్రయత్నిస్తారు. మిగతా ఎవరిగురించి పట్టించుకోరు. కానీ.. కొందరు అలా ఉండరు. ఎలాంటి ప్రమాదాన్నైనా ఎదుర్కొని, ధైర్యంగా ముందుకెళ్లి ఇతరులను కాపాడుతారు. ఇలాంటి ధైర్యసాహసాల ఘటన కర్నాటకలో జరిగింది. ఓ బస్సు డ్రైవర్ చేసిన సాహసానికి అందరూ అతడిని ప్రశంసిస్తున్నారు. ఆ వివరాల్లోకి వెళ్తే... బెంగళూరు నగరంలో ప్రయాణికులతో నిండిన ఓ పబ్లిక్ బస్సు ఉన్నట్టుండి ఆగిపోయింది. డ్రైవర్ దాన్ని తిరిగి స్టార్ట్ చేసేందుకు ప్రయత్నించాడు. ఇంతలోనే బస్సులో మంటలు చెలరేగాయి. క్రమంగా అవి బస్సు మొత్తం వ్యాప్తి చెందడం మొదలైంది. ఇది గ్రహించిన డ్రైవర్... వెంటనే ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. బస్సులో మంటలు చెలరేగాయి... వెంటనే అందరూ దిగిపోవాలని సూచించాడు. ఏ ఒక్క ప్యాసింజర్ కూడా లోపల చిక్కుకోకుండా అందరినీ బస్సులోనుంచి దింపేశాడు. ఎవరూ లేరని నిర్ధారించుకొని, చివర్లో తాను బస్సు దిగాడు. అనంతరం మంటలు మరింత వ్యాపించి బస్సు మొత్తం తగలబడిపోయింది. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని, మంటలు ఆర్పేసింది. అయితే... ఈ ప్రమాదం ఎలా సంభవించిందనే కారణాలు ఇంకా వెలుగులోకి రాలేదు. బెంగళూరు మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ఈ ప్రమాదానికి గల కారణాలేంటో పరిశీలిస్తున్నారు. ప్రాథమిక దర్యాప్తులో భాగంగా.. ఇంజిన్ ఓవర్‌హీట్ అవడం వల్లే మంటలు చెలరేగి ఉంటాయని అధికారులు అనుమానిస్తున్నారు. పూర్తి నివేదిక వచ్చేదాకా ఏదీ తేల్చలేమన్నారు. నివేదిక వచ్చాకే తదుపరి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ ఘటన ఎంజీ రోడ్డులో చోటు చేసుకుంది. ఈ బస్సు కోరమంగళ డిపోకు చెందినదిగా అధికారులు గుర్తించారు.

4 అసెంబ్లీ స్థానాల్లో ఉప ఎన్నికలు నేడే

టీఎంసీ, బీజేపీ హోరాహోరీ

కోల్‌కతా: నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉపఎన్నికలకు బుధవారం పోలింగ్ జరగనుండటంతో గెలుపుపై తృణమూల్ కాంగ్రెస్, బీజేపీ గట్టి ధీమాతో ఉన్నాయి. మానిక్‌తలా, రాయ్‌గంజ్, రానాఘాట్ దక్షిణ్, బగ్‌దాహ్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోలింగ్ జరుగనుంది. ఉప ఎన్నికలు జరుగుతున్న నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ టీఎంసీతో బీజేపీ తలపడుతోంది. 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ఈ నాలుగు సీట్లలో మూడు సీట్లను బీజేపీ గెలుచుకుంది. అయితే గెలిచిన ఎమ్మెల్యేలు అధికార టీఎంసీలోకి ఫిరాయించారు. మానిక్‌తాలా ఎమ్మెల్యే, టీఎంసీ నేత సాధన్ పాండే కన్నుమూయడంతో అక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. కాగా, ప్రస్తుతం ఉప ఎన్నిక జరుగుతున్న నాలుగు నియోజకవర్గాల్లో మానిక్‌తాలా, రానాఘాట్ దక్షిణ్, బగ్‌దాహ్‌లు సౌత్ బెంగాల్‌లో ఉన్నాయి. పార్టీ దివంగత నేత సాధన్ పాండే భార్య సుప్తి పాండేను మానిక్‌తాలా నుంచి టీఎంసీ ఎన్నికల బరిలోకి దింపింది. బీజేపీకి చెందిన రాయ్‌గంజ్ ఎమ్మెల్యే కృష్ణ కల్యాణి, బగ్‌దాహ్ ఎమ్మెల్యే బిశ్వజిత్ దాస్, రానాఘాట్ దక్షిణ్ ఎమ్మెల్యే ముకుట్ మణి అధికారి ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సొంత పార్టీని వీడి టీఎంసీలో చేరిపోయారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కార్తీక్ చంద్రపాల్ చేతిలో కల్యాణి ఓడిపోవడంతో ఆమె తిరిగి రాయ్‌గంజ్ అసెంబ్లీలో పోటీకి దిగారు. రానాఘాట్ లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ నేత జగన్నాథ్ సర్కార్ చేతిలో ఓడిపోయిన అధికారి రానాఘాట్ దక్షిణ్ అసెంబ్లీ సీటు నుంచి ప్రస్తుతం పోటీలో ఉన్నారు. బగ్‌దాహ్ అసెంబ్లీ నుంచి రాజ్యసభ ఎంపీ మమతాబాల ఠాకూర్ కుమార్తె మతువా ఠాకూర్‌బరిని టీఎంసీ పోటీలోకి దిపింది. మతువా మెజారిటీ నియోజకవర్గం కావడంతో టీఎంసీ గెలుపుపై గట్టి ధీమాతో కూడా ఉంది. కాగా, బీజేపీ తమ అభ్యర్థులుగా మానిక్‌తాలా నుంచి ఆల్ ఇండియా ఫుట్‌బాల్ ఫెడరేషన్ అధ్యక్షుడు కల్యాణ్ చౌబేను, రానాఘాట్ దక్షిణ్ నుంచి మనోజ్ కుమార్ బిస్వాస్‌ను, బగ్‌దాహ్ నుంచి బినయ్ కుమార్ బిశ్వాస్, రాయ్‌గంజ్ నుచి మానస్ కుమార్ ఘోష్‌ను పోటీకి దింపింది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో 42 స్థానాలకు 29 సీట్లు గెలిచిన ఉత్సాహంతో ఉన్న టీఎంసీ బుధవారంనాడు జరిగే ఉప ఎన్నికల్లో నాలుగు స్థానాలను గెలుచుకుంటామనే ధీమాతో ఉంది. 2019లో 19 లోక్‌సభ సీట్లు గెలుచుకున్న బీజేపీ ఈసారి ఎన్నికల్లో 12 స్థానాలకు పడిపోయినప్పటికీ బగ్‌దాహ్, రానాఘాట్ దక్షిణ్, రాయ్‌గంజ్ అసెంబ్లీ ఉపఎన్నికల్లో గెలుపుపై ధీమాగా ఉంది. లోక్‌సభ ఎన్నికల్లో ఈ మూడు అసెంబ్లీ సెగ్మెంట్లలో బీజేపీ లీడింగ్‌లో కొనసాగినందున తమ గెలుపు ఖాయమని చెబుతోంది.

రాహుల్ గాంధీని పార్లమెంటులో కొట్టాలి

బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు

బెంగళూరు: కర్నాటక బీజేపీ ఎమ్మెల్యే భరత్ శెట్టి, కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీని ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. హిందూ వ్యతిరేక వ్యాఖ్యలు చేసినందుకు అతడిని పార్లమెంట్‌లో బంధించి, కొట్టాలని అన్నారు. "రాహుల్ గాంధీని పార్లమెంట్ లోపల లాక్కెళ్లి కొట్టాలి. ఈ చర్య ఏడెనిమిది ఎఫ్‌ఐఆర్‌లకు దారి తీస్తుంది. మంగళూరు నగరానికి వస్తే, నేను అతడికి ఈ విధంగానే ఏర్పాట్లు చేస్తాను' అని మంగళూరు సిటీ నార్త్ ఎమ్మెల్యే శెట్టి అన్నారు. ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ శివుడి చిత్రాన్ని పట్టుకున్నారని, శివుడు మూడో కన్ను తెరిస్తే అతను బూడిదగా మారుతాడని ఆ పిచ్చివాడికి తెలియదని, వారు హిందూ వ్యతిరేక విధానాన్ని అవలంబిస్తున్నారని బీజేపీ నేత ఆరోపించారు. రాహుల్ గాంధీకి పిచ్చి పట్టిందని తేలిపోయిందని, హిందువులు తమ గురించి ఏం చెప్పినా నిశ్శబ్దంగా వింటారని ఆయన భావిస్తున్నారని, రాహుల్ గాంధీ పార్లమెంట్‌లో మొరిగితే, స్థానిక నాయకులు ఇక్కడ తోక ఊపడం ప్రారంభిస్తారన్నారు. హిందూ మతాన్ని, సంస్థల్ని రక్షించడం బీజేపీ కర్తవ్యమని ఆయన అన్నారు. హిందువులు, హిందుత్వ అనేది వేర్వేరు అని కాంగ్రెస్ చెప్పడం ప్రారంభించిందని, ఇలాంటి నాయకుల వల్ల భవిష్యత్తులో హిందువులు ప్రమాదంలో పడతారని, హిందువులు బయటకు రాని పరిస్థితి సృష్టిస్తారని అన్నారు. కేరళలో రాహుల్ గాంధీ పర్యటిస్తే సెక్యులర్ వ్యక్తిగా మారుతాడని, అదే తమిళనాడుకి వెళ్తే నాస్తికుడు అవుతారని ఆరోపించారు. గుజరాత్ వచ్చినప్పుడు ఆయన పరమ శివ భక్తుడిగా మారారని ఎద్దేవా చేశారు.

ఉగ్ర వ్యూహం... తొలుత డ్రైవర్‌పైనే గురి!



జమ్మూకశ్మీర్: ఉగ్రవాదులు ముందుగా వాహన డ్రైవర్లపైనే గురిపెడుతున్నారు. రెక్కీలు నిర్వహించడం... అత్యాధునిక ఆయుధాలు... స్థానికుల సాయం.. డ్రైవరే టార్గెట్... ఇలా ఒకే రకమైన శైలిలో ఇప్పటికే జమ్మూకశ్మీర్‌లో రెండు భారీ ఉగ్రదాడులు జరగడం ఆందోళనకరంగా మారింది. కథువా జిల్లాలో సోమవారం జరిగిన దాడి గతంలో రియాసీలో బస్సుపై జరిగిన ఉగ్ర ఘటనకు పోలికలున్నాయి. ఈసారి ముష్కరులు పక్కా ప్లానింగ్‌తో సైనిక వాహనాన్ని లక్ష్యంగా చేసుకొన్నట్లు కనిపిస్తోంది.

వాహనాలు నెమ్మదిగా నడిచే చోటే మాటువేసి...

మాచేడీ- కింట్లీ- మల్హార్ రోడ్డులో బడ్‌నోటా అనే గ్రామం వద్ద రోడ్డు బాగోలేదు. ఏ వాహనమైనా ఇక్కడ గంటకు 15 కిలోమీటర్ల వేగాన్ని మించకుండా వెళ్లాల్సిందే. ఉగ్రవాదులు ముందుగా నిర్వహించిన రెక్కీ ప్రకారం దాడికి ఈ ప్రాంతం అనువుగా ఉంటుందని గుర్తించి మాటువేశారు. ఇద్దరు లేదా ముగ్గురు పాక్ ఉగ్రవాదులకు.. ఒకరు లేదా ఇద్దరు స్థానిక గైడ్లు సాయం చేసినట్లు భద్రతా వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రాంతంపై పక్కాగా గురిపెట్టేలా ముష్కరులను సమీపంలోని ఓ కొండపైకి తీసుకెళ్లారు. వాహనం తమ టార్గెట్‌లోకి రాగానే దాడి మొదలుపెట్టారు. రోడ్డు సరిగ్గా లేనిచోట వాహనాన్ని అడ్డుకొని కాల్పులు జరపాలన్నది ఉగ్ర వ్యూహంలా కనిపిస్తోంది. ఈ క్రమంలోనే వారు తొలుత గ్రనేడ్ విసిరారు. ఆ తర్వాత తక్షణమే డ్రైవర్‌ను లక్ష్యంగా చేసుకొని కాల్పులు జరిపారు. అనంతరం నిలిచిపోయిన వాహనంపై విచక్షణారహితంగా రెండువైపుల నుంచి కాల్పులు జరిపారు. స్థానిక గైడ్ సాయంతో ఉగ్రవాదులు తమ స్థావరాలకు పారిపోయినట్లు భావిస్తున్నారు. ముష్కరులు రెక్కీ నిర్వహించడానికి, వారికి ఆహారం సమకూర్చడానికి ఆ గైడ్లే సాయం చేశారు. గతంలోనూ ఉగ్ర మూకలు ఇలా వాహన చోదకుడినే తొలుత టార్గెట్ చేసుకొన్నాయి. కథువా ప్రాంతంలోకి రెండు నెలల క్రితమే పెద్దసంఖ్యలో విదేశీ ఉగ్రవాదులు చొరబడినట్లు భద్రతా దళాల వద్ద సమాచారం ఉంది. జూన్ 11-12 తేదీల్లో ఇక్కడ జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు ఉగ్రవాదులను మట్టుబెట్టారు. నెల చివర్లో కూడా కోట్ పన్నూ వద్ద ఇద్దరు సాయుధులు సంచరిస్తున్నట్లు వార్తలొచ్చాయి. కథువాకు ఒకవైపు పాక్‌తో సరిహద్దు ఉంది. 1990-2000 మధ్య ఉగ్రవాదం తీవ్రస్థాయిలో ఉన్నప్పుడు మాచేడీలో సైనిక స్థావరం ఏర్పాటుచేశారు. గత నెల రియాసీలో బస్సుపై దాడి సమయంలో ఉగ్రవాదులు స్థానిక గైడు సాయం తీసుకొన్నట్లు దర్యాప్తు బృందాలు గుర్తించాయి. ఈసారీ అదేవిధంగా దాడి జరిగింది. దీనికితోడు అమెరికా తయారీ ఎం4 కార్బైన్‌ను ఈ దాడిలో వినియోగించారు.

భద్రతా దళాలకు సవాలుగా 'నాటో ఆయుధం'...

అమెరికా తయారీ ఎం4 కార్బైన్‌ను ఇటీవలకాలంలో ఉగ్రవాదులు ఎక్కువగా వినియోగిస్తున్నారు. నాటో దళాలు వాడే ఎం16ఏ2కు ఇది తేలికపాటి రకం. 2.5 కేజీల బరువు ఉంటుంది. పొట్టి బ్యారెల్‌తో వేగంగా కదలడానికి అనువైంది. 2021 అఫ్గనిస్థాన్ నుంచి అమెరికా దళాలు బిలియన్ల డాలర్ల విలువైన ఆయుధాలు వదిలి వెళ్లిపోయాయి. వీటిని పాక్‌లోని ఉగ్రసంస్థలైన లష్కరే, జైషేలు తాలిబన్ల నుంచి కొనుగోలు చేస్తున్నాయి. అవి గత కొంతకాలంగా పాక్ మీదుగా కశ్మీర్‌లోకి మెల్లగా చేరుతున్నాయి. గతంలో బారాముల్లాలోని 19వ ఇన్‌ఫాంట్రీ డివిజన్ జీవోసీ అజేయ్ చాంద్‌పురియా కూడా ఓ వార్త సంస్థ వద్ద ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రస్తుతం ఆయన వజ్ర కోర్ బాధ్యతలు చూస్తున్నారు. గతంలో పూంఛ్‌లో సైనిక వాహనంపై జరిగిన దాడిలో కూడా ఎం4ను వినియోగించారు. రియాసీలో ప్రయాణికుల బస్సుపై కూడా ఈ రకం తుపాకీతోనే కాల్పులు జరిపారు. దీనికితోడు సాయుధ కవచాలను ఛేదించే ప్రత్యేకమైన తూటాలను కూడా ఉగ్రవాదులు వాడుతున్నారు.

రాజ్‌నాథ్ సింగ్ సంతాపం

కథువాలో జరిగిన ఉగ్రదాడిలో ఐదుగురు సైనికుల మృతిపై రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సంతాపం తెలిపారు. ఈమేరకు ఆయన ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కష్ట సమయంలో వారికి దేశం మొత్తం అండగా నిలబడుతుందన్నారు. ఉగ్రవాదాన్ని నిరోధించేందుకు ఆపరేషన్లు కొనసాగుతాయని పేర్కొన్నారు. క్షతగాత్రులు వేగంగా కోలుకోవాలని ప్రార్థించారు.

యుద్ధ వాతావరణంలో

శాంతి చర్చలు సాధ్యం కాదు

మాస్కో/న్యూఢిల్లీ: యుద్ధ వాతావరణంలో శాంతి చర్చలు సాధ్యం కాదని, శాంతి పునరుద్ధణకు అన్ని విధాలా సహకరించేందుకు భారత్ సిద్ధంగా ఉందని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. తన రష్యా పర్యటనలో భాగంగా మంగళవారం పుతిన్‌తో జరిపిన ద్వైపాక్షిక చర్చల్లో ఉక్రెయిన్ గురించి మాట్లాడారు. యుద్ధాన్ని ఆపాలని కోరారు. పసిపిల్లలు ప్రాణాలు కోల్పోతుండటం గుండెలను పిండేస్తోందన్నారు. గాజాలోని పిల్లల ఆసుపత్రిపై రష్యా బాంబుల వర్షాన్ని ప్రస్తావించారు. భారత్-రష్యా 22వ వార్షిక శిఖరాగ్ర సదస్సు కోసం మాస్కోకు వెళ్లిన మోదీ సన్మానార్థం నోవో ఓగర్యోవోలోని తన అధికారిక నివాసంలో పుతిన్ విందు ఏర్పాటు చేశారు. ఇద్దరు నేతలు ఆలింగనం చేసుకొని తమ స్నేహాన్ని చాటుకున్నారు. పుతిన్‌తో ఉక్రెయిన్ గురించి మోదీ మాట్లాడారు. రష్యా దాడుల్లో గాజా చిన్నారులు ప్రాణాలు కోల్పోవడం కలచివేస్తున్నదన్నారు. యుద్ధ వాతావరణంలో శాంతి స్థాపన సాధ్యం కాదని చెప్పారు. ఈ పరిస్థితులను చక్కబెట్టేందుకు ఉక్రెయిన్‌తో చర్చలు, దౌత్య పద్ధతుల్లో సంప్రదింపులు అవసరమని సూచించారు. ఇందుకోసం అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు భారత్ సిద్ధంగా ఉందని మోదీ అన్నారు. పుతిన్ కూడా సానుకూలంగా స్పందించడంపై మోదీ సంతృప్తిని వ్యక్తంచేశారు. 'యుద్ధాలు/ఉగ్రదాడుల్లో జరిగే ప్రాణనష్టం మానవత్వం ఉన్న వారిని కలచివేస్తుంది. అమాయక పిల్లలు చనిపోవడం గుండెలను పిండేస్తుంది. ఈ అంశంపై పుతిన్‌తో చర్చించాను' అని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. అదే సమయంలో రష్యా సైన్యంలో ఉన్న భారతీయులకు విముక్తి కల్పించాలని కూడా పుతిన్‌ను కోరినట్లు మోదీ తెలిపారు. అందుకు పుతిన్ సానుకూలంగా స్పందించారన్నారు. దీంతో కొన్ని వారాల్లోనే తగు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. తన ఈ పర్యటనతో భారత్, రష్యా బంధం మరింత బలోపేతం కాగలదని మోదీ ఆకాంక్షించారు. మోదీ మంగళవారం రొసాటోమ్ పెవిలియన్‌ను, న్యూక్లియర్ టెక్నాలజీలో రష్యా విజయాలపై ఎగ్జిబిషన్‌ను సందర్శించారు. అమరుల స్మారకం వద్ద నివాళులర్పించారు.

సహకార బంధాన్ని

భారత్-రష్యా వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, రష్యా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం ఉన్నదని పుతిన్ అన్నారు. ఉక్రెయిన్‌లో యుద్ధానికి శాంతియుత పరిష్కారాన్ని కనుగొనేందుకు చేస్తున్న కసరత్తునకుగాను మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. భారత్, రష్యా మధ్య సహకార బంధాన్ని ప్రశంసించారు. ఆహారం, ఇంధనం, ఎరువుల కొరత లేకుండా కొన్నేళ్లుగా రష్యా సహకరిస్తోందని మోదీ తెలిపారు. తమ బంధం మరింత పటిష్ఠం కాగలదని ఆకాంక్షించారు. భారత్‌కు రష్యా మిత్రదేశమన్న మోదీ... గత రెండు దశాబ్దాల్లో ద్వైపాక్షిక బంధాన్ని బలపర్చుకోవడంలో పుతిన్ నాయకత్వాన్ని కొనియాడారు.

అందరి దృష్టి మాపైనే...

తన రష్యా పర్యటనను పశ్చిమ దేశాలు విమర్శిస్తుండటంపై మోదీ స్పందిస్తూ 'రష్యాతో చాలా ఏళ్లుగా ద్వైపాక్షిక చర్చలు కొనసాగుతున్నాయి కానీ ఈసారి మొత్తం ప్రపంచం దృష్టి నా ఈ పర్యటనపైనే ఉంది' అని అన్నారు. తన పర్యటనలో భాగంగా చోటుచేసుకునే ప్రతి పరిణామాన్ని నిశితంగా గమనిస్తూ ఎవరికి తోచిన నిర్ధారణకు వారు వస్తున్నారని వ్యాఖ్యానించారు. ప్రస్తుతం ప్రపంచానికి కావాల్సినది కాన్ఫ్లుయెన్స్ (సంగమం) తప్ప ఇన్ఫ్లుయెన్స్ (ప్రభావం) కాదని నొక్కిచెప్పారు. పదేళ్లలో భారత్ సాధించిన ప్రగతి ప్రపంచాన్ని విస్మయానికి గురిచేసిందన్నారు. నిర్దేశిత లక్ష్యాలను సాధించేందుకు మూడింతలు కష్టపడాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు.

రష్యాలో రెండు భారత కాన్సులేట్లు

రష్యాలో రెండు కౌన్సులేట్లు ప్రారంభిస్తామని మోదీ ప్రకటించారు. కజన్, యకటెరింగ్ బెర్గ్‌లో కొత్త కాన్సులేట్లు ఏర్పాటు చేస్తామని భారత ప్రధాని తెలిపారు. తమ సహకారంతో ప్రపంచానికి మేలు జరిగిందని పుతిన్‌తో మోదీ అన్నారు. ఆర్థిక సహకారం ప్రత్యేకించి ఇంధనం, వాణిజ్యం, ఉత్పత్తి రంగాల్లో సహకారం ఎంతగానో దోహదమైందన్నారు.

కుదిరిన ఒప్పందాలు

ఇంధనం, వాణిజ్యం, సహకారం, పెట్టుబడులకు సంబంధించిన ఒప్పందాలపై రెండు దేశాల ప్రతినిధులు సంతకాలు చేశారు. సమగ్ర ఉమ్మడి ప్రకటన, విజన్ ప్రకటనలపైనా వీరికి ఏకాభిప్రాయం కుదిరింది. అనేక అవగాహన ఒప్పందాలు కుదిరినట్లు అధికార వర్గాలు తెలిపాయి.

జెలెన్‌స్కీ ఆగ్రహం

తమ దేశంపై బాంబుల వర్షాన్ని కురిపిస్తున్న రష్యాకు భారత ప్రధాని మోదీ వెళ్లడంపై ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ అసంతృప్తి వ్యక్తంచేశారు. ఈ పరిణామం తనను నిరాశపర్చిందని 'ఎక్స్'లో పేర్కొన్నారు. మోదీ పర్యటన శాంతి చర్చలకు విఘాతం కలిగిస్తుందని అభిప్రాయపడ్డారు. ప్రపంచంలోని అతిపెద్ద ప్రజాస్వామ్యం... కిరాతక దేశాన్ని ఆలింగనం చేసుకోవడం ఏమిటంటూ ఆగ్రహం వ్యక్తంచేశారు.

మోదీకి రష్యా అత్యున్నత పౌర పురస్కారం

మాస్కో: తమ దేశ అత్యున్నత పౌర పురస్కారంతో భారత ప్రధాని మోదీని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ సన్మానించారు. భారత్-రష్యా వార్షిక సదస్సు ముగిసిన అనంతరం మాస్కోలోని క్రెమ్లిన్‌లో జరిగిన వేడుకలో భాగంగా 'సెయింట్ ఆండ్రూ ది అపాస్టిల్ ది ఫస్ట్-కాల్డ్, రష్యా'ను మోదీకి బహూకరించారు. రష్యా, భారత్ మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యానికి అందించిన గణనీయమైన తోడ్పాటునకు, రెండు దేశాల మధ్య స్నేహ సంబంధాలకు ప్రతీకగా ఈ పురస్కారాన్ని పుతిన్ అందజేశారు. ఈ సన్మానాన్ని అందుకున్న తొలి భారతీయ నాయుడిగా మోదీ నిలిచారు. ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపాస్టిల్‌ను అందుకోవడం తనకెంతో గౌరవంగా ఉందని, దీనిని భారత ప్రజలకు అంకితమిస్తున్నానని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని స్వీకరించే సమయంలో దీనిని భారత్-రష్యా మధ్య సంప్రదాయ స్నేహబంధానికి అంకితమిస్తున్నట్లుగా మోదీ తెలిపారు. తమ దేశాల మధ్య ప్రత్యేక, ప్రతిష్ఠాత్మక, వ్యూహాత్మక భాగస్వామ్యానికి ప్రతీకగా వర్ణించారు.

సాంకేతికతతో కొత్త సవాళ్లు: ముర్ము

భువనేశ్వర్: నూతన సాంకేతికతతో ఎన్ని ప్రయోజనాలున్నాయో అంతే స్థాయిలో ముప్పు పొంచి ఉందని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభిప్రాయపడ్డారు. నూతన సాంకేతిక పరిణామాలు సమాజ అభ్యున్నతికి దోహదం చేస్తున్నాయని, అదే సమయంలో మానవాళికి కొత్త సవాళ్లను కూడా విసురుతున్నాయని రాష్ట్రపతి అన్నారు. భువనేశ్వర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐఎస్ఈఆర్) 13వ గ్రాడ్యుయేషన్ వేడుకల్లో రాష్ట్రపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ "శాస్త్రసాంకేతిక రంగాల్లో ప్రస్తుతం విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. సైన్స్ వల్ల ఎన్ని ప్రయోజనాలున్నాయో, అంతే స్థాయిలో దుష్ప్రభావాలు కూడా ఉన్నాయి. కొత్త సాంకేతికత వల్ల సమాజానికి ఎంతో మేలు జరుగుతుంది. అదే సమయంలో మానవాళికి అది సరికొత్త సవాళ్లను విసురుతుంది. ఉదాహరణకు క్రిస్పర్-క్యాస్9 సాంకేతికత వల్ల మానవుల జన్యువులల్లో మార్పులు చేయడం చాలా సులభమైంది. ఎన్నో రకాల వ్యాధులను నయం చేసేందుకు సహకరించింది. అయితే, ఈ సాంకేతికత సామాజికంగా ఎన్నో రకాల సమస్యలు సృష్టించింది. అంతేకాకుండా ఇటీవల బాగా ప్రాచుర్యం పొందిన కృత్రిమమేధ వల్ల డీప్ ఫేక్ సమస్య ఎదురైంది. సాంకేతికతను సక్రమ మార్గంలో ఉపయోగించకపోతే ఎలాంటి పరిస్థితులు ఎదురవుతాయో ఊహించలేం" అని ద్రౌపది ముర్ము అన్నారు. సైన్స్ హేతుబద్ధతకు సంప్రదాయ విలువలను జోడిస్తూ ఎన్ఐఎస్ఈఆర్ ముందుకు వెళ్తుండటం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. తమ వృత్తిలో ఉన్నత శిఖరాలను అధిరోహించడమే కాకుండా, సమాజసేవ చేయాలని విద్యార్థులకు ఆమె సూచించారు. "జాతిపిత మహాత్మాగాంధీ ఏడు సామాజిక రుగ్మతలు ఉంటాయని విశ్వసించేవారు. అందులో 'దయలేని సైన్స్' కూడా ఒకటి. జాలి, దయ, మానవత్వం గురించి ఆలోచించకుండా సైన్స్‌ని ప్రచారం చేయడం మహా పాపం. ప్రతి ఒక్కరూ దీనిని గుర్తుంచుకోవాలి" అని హితవు పలికారు. శాస్త్రపరిజ్ఞానంపై పరిశోధనలు చేసేందుకు చాలా ఓర్పు సహనం అవసరమని, ఫలితం రాబట్టేందుకు చాలా కాలం వేచి చూడాల్సి రావొచ్చని ముర్ము అన్నారు. అధైర్యపడకుండా, వెనుకంజ వేయకుండా లక్ష్యం దిశగా సాగాలని ఆమె కోరారు.

స్టాన్‌స్వామికి న్యాయమే లక్ష్యం

ఆయన మరణంపై స్వతంత్ర దర్యాప్తు జరిపించాలి

భారత్‌కు అమెరికా చట్టసభ్యుల వినతి: ప్రతినిధుల సభలో తీర్మానం

వాషింగ్టన్: ప్రముఖ మానవహక్కుల కార్యకర్త ఫాదర్ స్టాన్‌స్వామికి న్యాయం జరగాలనే లక్ష్యంతో అమెరికాకు చెందిన ముగ్గురు చట్టసభ్యులు అక్కడి ప్రతినిధుల సభలో ఒక తీర్మానం చేశారు. స్టాన్ స్వామి మరణంపై స్వతంత్ర దర్యాప్తును భారత్ జరిపించాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌మెన్ జువాన్ వర్గస్, చట్టసభ్యులు జిమ్ మెక్ గవర్న్, ఆగ్రే కార్సన్ దీనిని ప్రతిపాదించారు. బీమా కోరేగావ్ కేసులో జైలుకెళ్లిన స్టాన్‌స్వామి కస్టడీలో ఉండగా 2021, జులై 5న చనిపోయారు. మానవహక్కుల సమర్థకులు, రాజకీయ ప్రత్యర్థులపై వలసవాద దేశద్రోహం చట్టాన్ని ఆపాదించడం, ఉగ్రవాద చట్టాలను దుర్వినియోగించడంపై అమెరికా చట్టసభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. వివాదాస్పద దేశద్రోహం చట్టం రద్దునకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతించారు. శాశ్వతంగా దీనిని రద్దు చేయాలని భారత పార్లమెంటుకు సూచించారు. భావ ప్రకటన స్వేచ్ఛ అన్నది ప్రాథమిక హక్కు అని భారత్‌తో పాటు ప్రపంచ దేశాలకు ఈ తీర్మానం స్పష్టంచేసింది. ఐరాస జనరల్ అసెంబ్లీ 1948లో ఆమోదించిన మానవహక్కుల యూనివర్సల్ డిక్లరేషన్‌లోని 19వ ఆర్టికల్‌ను ప్రస్తావించింది. మానవులకు చట్ట ప్రకారం ఉన్న హక్కులను గుర్తుచేసింది. ఫాదర్ స్టాన్ వెనుకబడిన వర్గాల గొంతకయ్యారని, ఆదివాసీల హక్కుల కోసం నిర్విరామంగా పోరాడారని, భారత్‌లోని అనేక వర్గాలకు న్యాయం జరిగేలా పాటుపడ్డారని జువాన్ వర్గస్ అన్నారు. కస్టడీలో ఉన్నప్పుడు ఆయనను వేధించడమే కాకుండా వైద్య సంరక్షణ నిరాకరించడం కలచివేసిందన్నారు. స్టాన్ స్వామి జీవిత ఆశయాలు ఎప్పటికీ మర్చిపోకుండా ఉండాలనే ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టినట్లు చెప్పారు. స్టాన్ స్వామి జీవితానికి సంబంధించిన అనేక అంశాలను అందులో పేర్కొన్నారు. ఆయన మరణంపై స్వతంత్ర దర్యాప్తును జరిపించాలని భారత్‌ను కోరుతున్నట్లు వెల్లడించారు.

ఉగ్రవాదుల అంతు చూస్తాం

కేంద్ర రక్షణ శాఖ

న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లోని కథువా జిల్లాలో సైనికులపై ఉగ్రవాదులు విరుచుకుపడిన ఘటనపై కేంద్ర రక్షణమంత్రిత్వశాఖ స్పందించింది. ఐదుగురు సైనికుల మృతికి కారణమైన ఉగ్రవాదులపై ప్రతీకారం తీర్చుకుంటామని రక్షణ శాఖ కార్యదర్శి గిరిధర అరమనే పేర్కొన్నారు. ఉగ్రదాడిలో మరణించిన జవాన్లకు సంతాపాన్ని వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. దేశం ఎల్లప్పుడూ వారి సేవల్ని గుర్తు చేస్తుంటుందని, ఈ దాడి వెనక ఉన్న దుష్టశక్తుల్ని భారత్ ఓడిస్తుందని 'ఎక్స్' ద్వారా రక్షణ మంత్రిశాఖ ట్వీట్ చేసింది. కాగా జమ్మూకశ్మీర్ లో ఉగ్రవాదులు రెచ్చిపోతున్నారు. ఇటీవల పర్యటకుల వాహనంపై దాడి ఘటనను మరువకముందే మరో ఘాతుకానికి పాల్పడ్డారు. కథువా జిల్లాలో సైనిక వాహనంపై చేసిన మెరుపుదాడిలో ఐదుగురు జవాన్లు అమరులయ్యారు. మరికొందరు సిబ్బంది గాయపడ్డారు. ఈ ఘటనను తీవ్రంగా పరిగణించిన భారత రక్షణ మంత్రిత్వశాఖ... ఉగ్ర చర్యలపై మండిపడింది. ఈ ఘాతుకానికి పాల్పడిన ఉగ్రవాదుల అంతు చూస్తామని హెచ్చరించింది. "కథువా జిల్లాలో జరిగిన ఉగ్ర దాడిలో ఐదుగురు సాహసవీరులను దేశం కోల్పోయింది. వారి మృతికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాం. బాధిత కుటుంబాలకు భారత ప్రభుత్వం అండగా ఉంటుంది. దేశం కోసం జవాన్లు తమ ప్రాణాలు అర్పించి అమరులయ్యారు. వారి త్యాగాలు వృథా కానివ్వం. దీనికి తప్పకుండా ప్రతీకారం తీర్చుకుంటాం. ఈ దాడి వెనక ఉన్న దుష్టశక్తులను మట్టుపెడతాం" అని కేంద్ర రక్షణ మంత్రిత్వశాఖ 'ఎక్స్' పోస్ట్‌లో పేర్కొంది. కథువా జిల్లాలోని మారుమూల ప్రాంతం మాచేడీలో సోమవారం సైనిక వాహనంపై ఉగ్రవాదులు దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో ఐదుగురు జవాన్లు వీర మరణం పొందారు. కాల్పులు జరిపిన అనంతరం పోలీసులు, పారామిలిటరీ దళాలు దీటుగా ప్రతిస్పందించడంతో సమీపంలోని అడవిలోకి పారిపోయారు. దీంతో వారిని మట్టుపెట్టేందుకు అదనపు బలగాలు ప్రత్యేక ఆపరేషన్ చేపట్టాయి. ఈ నేపథ్యంలోనే సైనికుల మరణానికి కారణమైన ఉగ్రవాదులను వదిలే ప్రసక్తే లేదని కేంద్ర రక్షణశాఖ స్పష్టం చేసింది. ఈ దాడికి పాకిస్థాన్‌కి చెందిన జైషే మహ్మద్ ఉగ్రవాద సంస్థకు అనుబంధంగా ఉన్న కశ్మీర్ టైగర్స్ బాధ్యత వహించింది. గత రెండు వారాల్లో భారత సైన్యంపై జరిగిన రెండో దాడి ఇది.

కేంద్రం వివరణ ఇవ్వాలి: కాంగ్రెస్

కథువా ఉగ్రదాడి ఘటన విషయంలో కేంద్రప్రభుత్వ తీరుపై రాజస్థాన్‌కు చెందిన కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఉప ముఖ్యమంత్రి సచిన్ పైలట్ స్పందించారు. జమ్మూకశ్మీర్‌లో తరచూ ఉగ్రవాద దాడులు జరుగుతున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మధ్య కాలంలో దాడులు మరింత పెరిగాయని విమర్శించారు. ఒకవైపు ఉగ్రవాద దాడులు పెరుగుతుంటే...మరోవైపు కేంద్ర సర్కారు మాత్రం జమ్ము కశ్మీర్‌లో సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని పార్ల మెంట్ సాక్షిగా అవాస్తవాలు చెబుతోందని పైలట్ ఆవేదన వెలిబుచ్చారు. మన సైనికులు ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయి నప్పుడు... ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో ఐదుగురు సైనికులు మరణించినా ప్రభుత్వం పట్టనట్లు వ్యవహరిస్తోందని సచిన్ పైలట్ విమర్శించారు.

జలాశయాలల్లో పెరిగిన నీటి మట్టం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో ప్రధాన రిజర్వాయర్లలో నీటి మట్టం పెరిగిందని కేంద్ర జల కమిషన్ (సీడబ్ల్యూసీ) వెల్లడించింది. గతేడాది సెప్టెంబరు తర్వాత ఇలా జరగడం ఇదే మొదటిసారిగా తెలిపింది. గత వారం నుంచి రెండు శాతం పెంపుదల నమోదు కాగా ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం 73 శాతంగా ఉన్నట్లు పేర్కొంది. 2023, సెప్టెంబరు 29 నుంచి ఏ వారానికి ఆ వారం నీటి మట్టం తగ్గిందేగానీ పెరగలేదని వెల్లడించింది. దేశంలోని 150 జలాశయాలలో నీటి నిల్వలను సీడబ్ల్యూసీ పర్యవేక్షిస్తుంది. ప్రతి గురువారం వీక్లీ బులిటిన్‌లో జలాశయాల పరిస్థితిని వెల్లడిస్తుంది. 150లో నుంచి 20 రిజర్వాయర్లు... జలవిద్యుత్ ప్రాజెక్టులతో ముడిపడి ఉండగా, వీటి ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం 35.30బిలియన్ క్యూబిక్ మీటర్లు (బీసీఎం)గా వెల్లడించింది. అసోం, జార్ఖండ్, ఒడిశా, పశ్చిమ బెంగాల్, త్రిపుర, నాగాలాండ్, బీహార్ సహా ఈశాన్య భారతంలో 20.430 బీసీఎం ప్రత్యక్ష నిల్వ సామర్థ్యంగల 23 జలాశయాలు ఉన్నాయి. గతేడాదితో పోల్చితే వీటి సామర్థ్యం 3.979 బీసీఎంల మేర ఉన్నది. గుజరాత్, మహారాష్ట్రతో సహా పశ్చిమ భారతంలోని 49 రిజర్వాయర్ల ప్రత్యక్ష నీటి నిల్వ సామర్థ్యం మొత్తం 37.130 బీసీఎంలు కాగా ప్రస్తుతం 7.949 బీసీఎంలుగా ఉన్నది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్‌తో సహా మధ్య భారతంలోని 26 జలాశయాల ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం మొత్తం 38.227 బీసీఎంలు కాగా గతేడా దితో పోల్చితే 12.26 బీసీఎంలుగా ఉంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, కేరళ, తమిళనాడుతో సహా దక్షిణ భారతంలోని 42 రిజర్వాయర్ల ప్రత్యక్ష నిల్వ సామర్థ్యం మొత్తం 53.334 బీసీఎంలు కాగా ప్రస్తుతం 10.152 బీసీఎంలుగా ఉంది. బ్రహ్మపుత్ర, సబర్మతి, తాద్రీ నుంచి కన్యాకుమారికి ప్రవహించే పశ్చిమ నదులు.. ఇండస్, సబర్నరేఖ, మహి, ఇతర నదుల్లో నిల్వలు సాధారణం కంటే మెరుగ్గా ఉన్నట్లు సీడబ్ల్యూసీ వెల్లడించింది. మహానంది, కావేరి, బ్రహ్మణి, బైతర్ని నదుల్లో నిల్వల్లో లోటు నమోదు కాగా పెన్నార్, కన్యాకుమారి మధ్య తూర్పు నదుల్లోనూ లోటు కనిపించిందని పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.